
ఈనాడు
అమరావతి
గుంటూరు
ఆదివారం అక్టోబరు 20, 2024

నవ లోగిలికి... చంద్ర తోరణం



న్యూస్‌టుడే, తుళ్లూరు

శుభ తరుణమిది... కోట్లాది మనసులు అభిలషించిన శుభ ఘడియలివి.. రాజధాని అమరావతికి పునఃప్రాణ ప్రతిష్ఠ చేసిన అపురూప సన్నివేశమిది..


ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సీడ్ యాక్సెస్ రహదారి పక్కన సీఆర్డీఏ ప్రాజెక్టు కార్యాలయ పనులను శనివారం ప్రారంభించడం ద్వారా కొత్త అధ్యాయానికి తెర తీశారు. దృఢమైన సంకల్పంతో ఎంతటి లక్ష్యమైనా సాధించొచ్చని, సంపద సృష్టించడానికి డబ్బు అవసరం లేదని... మంచి ఆలోచన ఉంటే చాలని పిలుపునిచ్చిన ఆయన అమరావతి నిర్మాణానికి శుభారంభం చేశారు. రాజధాని ప్రాంత మ్యాపులను పరిశీలించిన అనంతరం రైతులనుద్దేశించి మాట్లాడారు. అంతకు ముందు ఆయనకు రైతులు ఎదురేగి ఉత్సాహంగా అభివాదం చేశారు. చంద్రబాబు చిరునవ్వుతో అన్నదాతలకు నమస్కరించారు. సమావేశంలో అమరావతి అభివృద్ధిపై సీఎం స్పష్టమైన విధానాలు ప్రకటించడంతో రాజధాని రైతులు కరతాళ ధ్వనులు చేశారు. ఈ కార్యక్రమానికి రాజధాని గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో రైతులు, రైతు కూలీలు, నాయకులు, కార్యకర్తలు భారీగా హాజరయ్యారు. ఏడీసీ ఛైర్‌పర్సన్ లక్ష్మీపార్థసారథి, జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, ఎస్పీ ఎస్.సతీష్ కుమార్, సీఆర్డీఏ అదనపు కమీషనర్ జి.సూర్యసాయి ప్రవీణ్ చంద్ తదితరులు పాల్గొన్నారు.


సీఆర్డీఏ ప్రాజెక్టు కార్యాలయం పనులకు సీఎం చంద్రబాబు పూజలు. చిత్రంలో మంత్రి నారాయణ, ఎమ్మెల్యే తెనాలి శ్రావణకుమార్, సీఆర్డీఏ కమిషనర్ కాటంనేని భాస్కర్ తదితరులు

రైతులకిచ్చిన హామీలు నెరవేరుస్తాం

– పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ

ఎన్ని సమస్యలున్నా రాజధాని రైతులకిచ్చిన హామీలను నెరవేరుస్తాం. ప్రపంచంలో టాప్ 5 నగరాల్లో ఒకటిగా అమరావతిని అభివృద్ధి చేస్తాం. ముఖ్యమంత్రి చంద్రబాబు మీద ఉన్న నమ్మకంతో రాజధాని నిర్మాణానికి కేవలం 58 రోజుల వ్యవధిలో 34 వేల ఎకరాలను అన్నదాతలు స్వచ్ఛందంగా ఇచ్చారు. వారి నమ్మకానికి అనుగుణంగా అప్పట్లో రూ. 48 వేల కోట్ల రూపాయలతో అమరావతి నిర్మాణ పనులు ప్రారంభించాం. గత ప్రభుత్వం ఆ నిర్మాణాలను ఆపేసి అమరావతిని నాశనం చేయాలని చూసింది. వైకాపా ప్రభుత్వంలో ఏర్పడిన చిక్కులు, సమస్యలు, సాంకేతిక ఇబ్బందులను అధిగమించి రాజధాని పనులు ప్రారంభించడానికి ప్రణాళికలు సిద్ధం చేశాం. డిసెంబరు నెలాఖరులోపు పనులకు టెండర్లు పిలవడం పూర్తి చేస్తాం. ప్రభుత్వానికి ఆర్థిక ఇబ్బందులున్నా.. రైతులకివ్వాల్సిన కౌలు విడుదల చేస్తాం.


సీఆర్డీఏ కార్యాలయ నిర్మాణ పనుల వివరాలను చిత్ర ప్రదర్శన ద్వారా సీఎం చంద్రబాబుకు వివరిస్తున్న సీఆర్డీఏ కమిషనర్ కాటంనేని భాస్కర్

ఇక జెట్ స్పీడే – సీఎం చంద్రబాబు

కేంద్ర ప్రభుత్వ సహకారంతో అమరావతి అభివృద్ధి పనులు జెట్ స్పీడ్‌తో చేపడతాం. రాష్ట్ర విభజనతో కట్టుబట్టలతో హైదరాబాద్ నుంచి వచ్చేశాం. నూతన రాష్ట్ర రాజధాని నిర్మాణానికి భూసమీకరణ జరిపి పిలుపునిస్తే... కొద్ది రోజుల్లోనే 34,241 ఎకరాలను రైతులు స్వచ్ఛందంగా ఇచ్చారు. రాష్ట్రానికి రాజధాని ఉండాలన్న సంకల్పంతో అమరావతికి భూములిచ్చిన అన్నదాతలను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నా. గత వైకాపా ప్రభుత్వం పోలీసు పాలనతో రైతులపై అక్రమ కేసులు పెట్టింది. అడుగడుగునా హింసించింది.

ఇది శుభపరిణామం – సీఆర్డీఏ కమిషనర్ కాటంనేని భాస్కర్

ఐదేళ్ల తరువాత అమరావతి రాజధాని నిర్మాణ పనులు పునఃప్రారంభం కావడం శుభపరిణామం. రానున్న మూడేళ్లలో రాజధాని నగరంలో రహదారులు, భవనాలు, శాసనసభ, సచివాలయం, హైకోర్టువంటి కట్టడాలను పూర్తి చేస్తాం. అన్ని విభాగాలు తరలిపోయాయి. అమరావతికి ఇక్కడ పెట్టుబడులు పెట్టినవారికి మంచి రోజులొచ్చాయి. రైతులు సీఆర్డీఏ పనుల కోసం విజయవాడకు వచ్చే పని లేకుండా నాలుగు నెలల్లో సీఆర్డీఏ ప్రాజెక్టు కార్యాలయ భవన నిర్మాణాన్ని పూర్తి చేస్తాం. రైతులు సంఘాలు, సూచనలు తెలియజేయడానికి అందుబాటులో ఉంటాం. సీఆర్డీఏ, ఏడీసీ, పురపాలక శాఖతోపాటు పలు ప్రభుత్వ విభాగాలు ఇక్కడ ప్రారంభమవుతాయి.

ప్రతి నెలా అభివృద్ధి కార్యక్రమాలు చేపడతాం

– తెనాలి శ్రావణ్‌కుమార్, తాడికొండ ఎమ్మెల్యే

అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేతుల మీదుగా అభివృద్ధి పనులు ప్రారంభించడం సంతోషంగా ఉంది. వైకాపా ఐదేళ్ల పాలనలో అమరావతిని చిట్టడివిలా మార్చేసింది. వేలాదిమందిపై దుర్మార్గంగా కేసులు పెట్టింది. కౌలు చెల్లించకుండా రైతులను వేధింపులకు గురి చేసింది. రాజధానిలో భూమి లేని నిరుపేదలకు రూ. 5 వేల పింఛను ఇచ్చి తెదేపా కూటమి ప్రభుత్వం అండగా నిలిచింది. సాంకేతిక కారణాలతో పింఛను నిలిచిపోయినవారి సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నా. ఇకమీదట అమరావతిలో ప్రతి నెలా అభివృద్ధి కార్యక్రమాలు చేపడతాం.

ప్రపంచ స్థాయి నగరంగా...



రాజధాని నిర్మాణ పనులను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పునఃప్రారంభించడంతో అమరావతికి కొత్త కళ వచ్చింది. అభివృద్ధి పనులు వేగంగా జరుగుతాయని భావిస్తున్నాం. చంద్రబాబునాయుడి సారథ్యంలో అమరావతి ప్రపంచ స్థాయి నగరంగా గుర్తింపు పొందుతుంది.

– పువ్వాడ సుధాకర్, అమరావతి ఐకాస కన్వీనర్, తుళ్లూరు

స్వర్ణాంధ్రప్రదేశ్‌గా మారుస్తారు



ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విజన్ 2047తో రాష్ట్రాన్ని స్వర్ణాంధ్రప్రదేశ్‌గా మారుస్తారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు, ఉపాధి అవకాశాలు, పరిశ్రమలు, పోలవరం, రహదారుల అభివృద్ధితో రాష్ట్రం ప్రగతి పథాన పయనించడం ఖాయం.

– మైనేని గిరిజ, రాజధాని రైతు, దొండపాడు

ఉపాధి అవకాశాలొస్తాయి



ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడి సారథ్యంలో అమరావతి నిర్మాణం నిరాటంకంగా సాగుతుంది. దీనివల్ల స్థానికంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయి. వైకాపా ప్రభుత్వ హయాంలో పనుల్లేక ఇబ్బందిపడ్డ కార్మికులకు ఉపశమనం లభిస్తుంది.

– బండ్ల పట్టాభిరామయ్య, రాజధాని రైతు, తుళ్లూరు

ఆ కార్యాలయంతో రైతులకు మేలు



రాజధానిలో సువిశాలమైన సీఆర్డీఏ కార్యాలయం ఏర్పాటు చేయడం సంతోషంగా ఉంది. అమరావతి నిర్మాణ పనులు వేగంగా జరగడానికి దోహదపడుతుంది. సమస్యలను తెలియజేయడానికి విజయవాడ వెళ్లే అవసరం లేకుండా ఈ కార్యాలయం అందుబాటులోకి వస్తుంది.

– కొమ్మినేని వరలక్ష్మి, రైతు, మందడం

డ్రగ్స్ వెనుక అతడే!



- మాజీ ప్రజాప్రతినిధి తనయుడి పాత్రపై దర్యాప్తు
- బెంగళూరు కేంద్రంగా కార్యకలాపాలు
- నాటి వైకాపా హయాంలో రెచ్చిపోయిన పుత్రరత్నం

ఈనాడు – అమరావతి

డ్రగ్స్ వ్యవహారం వెనుక గుంటూరు నగరానికి చెందిన ఓ మాజీ ప్రజాప్రతినిధి తనయుడి పాత్రపై పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ దిశగా దర్యాప్తు ముమ్మరం చేశారు. మూడు రోజుల క్రితం బెంగళూరు నుంచి గుంటూరుకు మత్తు పదార్థాలు సరఫరా అయిన సంగతి తెలిసిందే. గత ఐదేళ్ల కాలంలో తండ్రి అధికారాన్ని అడ్డు పెట్టుకుని పోలీసులను గుప్పిట ఉంచుకుని అధికారమే అండగా సదరు పుత్రరత్నం చెలరేగిపోయాడు. గుంటూరును మత్తు పదార్థాల విక్రయాలకు అడ్డాగా మార్చేశాడన్న బలమైన ఆరోపణలున్నాయి. తెదేపా కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే నగరంలో గంజాయి, ఇతర మత్తు పదార్థాల విక్రయాలకు తావుండకూడదన్న ఆదేశాలతో పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది. వైకాపా ప్రభుత్వ హయాంలో మత్తు పదార్థాల విక్రయాల్లో కూరుకుపోయిన వారందరినీ గుర్తించి, కదలికలపై పోలీసులు నిఘా పెట్టారు. దీంతో ఆ కార్యకలాపాలు సద్దుమణిగాయి. గత ఐదేళ్లలో ద్రవ మత్తు పదార్థాల అమ్మకాల ద్వారా పెద్దఎత్తున అకమార్జన చేసిన ఆ మాజీ ప్రజాప్రతినిధి కుమారుడు తెదేపా కూటమి ప్రభుత్వం రాగానే మకాం బెంగళూరుకు మార్చేశాడు. అక్కడి నుంచే కార్యకలాపాలు కొనసాగిస్తున్నాడని పోలీసులకు సమాచారం అందింది. తాజాగా డిస్కో బల్బును ఊడదీసి అందులో డ్రగ్స్ పెట్టి గుంటూరుకు పంపడం సంచలనమైంది. సదరు నేత కుమారుడిపై పోలీసులు దృష్టి పెట్టారు. నిందితులిచ్చిన సమాచారం ఆధారంగా ఓ పోలీసు బృందం బెంగళూరు వెళ్లింది.

గతంలో పట్టుబడినా కేసే లేదు!

గత సార్వత్రిక ఎన్నికల సమయంలో బొల్లాపల్లి టోల్‌ప్లాజా వద్ద ఓ ప్రైవేటు బస్సులో డ్రగ్స్‌ను పోలీసులు పట్టుకున్నారు. ఆ బస్సుకు ముందు పైలెట్‌గా సదరు వైకాపా నేత పుత్రరత్నం ఎమ్మెల్యే స్టిక్కర్ ఉన్న వాహనంలో వెళ్తూ పట్టుబడ్డాడు. అప్పట్లో రాజకీయ ఒత్తిళ్లతో అతడిని కేసులో చేర్చలేదని పోలీసువర్గాలు తెలిపాయి. గత ప్రభుత్వ హయాంలో రూ. లక్షల విలువైన డ్రగ్స్ పట్టుబడ్డాయి. పలుమార్లు ప్రైవేటు ట్రావెల్స్‌లో ఇక్కడికి రప్పించారు. విద్యార్థులను మత్తుకు బానిసలుగా మార్చేశారు. తెదేపా కూటమి అధికారంలోకి రాగానే.. కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ గుంటూరు రేంజి ఐజీ, ఎస్పీలతో ప్రత్యేకంగా మాట్లాడారు. డ్రగ్స్ వ్యవహారాల్లో ఎంతటివారున్న వదలొద్దని స్పష్టం చేశారు.

హక్కులకు భంగం కలిగితే ఫిర్యాదు చేయొచ్చు

ఎన్‌హెచ్‌ఆర్సీ యాక్టింగ్ ఛైర్‌పర్సన్ విజయభారతి సయాని

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే: ప్రాథమిక హక్కులకు భంగం కలిగితే పౌరులు జాతీయ మానవ హక్కుల కమిషన్(ఎన్‌హెచ్‌ఆర్సీ)కు ఫిర్యాదు చేయవచ్చని, ప్రతి నెలా 1.5 లక్షల ఫిర్యాదులు వస్తున్నాయని కమిషన్ యాక్టింగ్ ఛైర్‌పర్సన్ విజయభారతి సయాని చెప్పారు. గుంటూరు వచ్చిన ఆమె కలెక్టరేట్‌లో అధికారులతో సమావేశం అనంతరం మీడియాతో మాట్లాడారు. కమిషన్ వద్దకు వచ్చిన వాటిలో నెలకు 60 వేల నుంచి 70 వేల ఫిర్యాదులు స్వీకరిస్తున్నామన్నారు. జిల్లాలో ఎస్టీ బాలికల వసతిగృహాన్ని పరిశీలించామని, గుర్తించిన అంశాలపై కమిషన్‌కు నివేదించి.. చర్చించుకుని తదుపరి చర్యలు చేపడతామన్నారు. సమావేశంలో జేసీ ఎ.భార్గవ్ తేజ, తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సింహ, అసిస్టెంట్ కలెక్టర్ పవార్ స్వప్నిల్ జగన్నాథ్, డీఆర్వో పెద్ది రోజా పాల్గొన్నారు.

కుండపోత

గుంటూరు నగరాన్ని ముంచెత్తిన వాన


ఉరుములు, మెరుపులతో బీభత్సం

కలెక్టరేట్ (గుంటూరు), పట్నంబజారు, న్యూస్‌టుడే: గుంటూరు నగరాన్ని వరుణుడు వణికించాడు. శనివారం మధ్యాహ్నం దాదాపు గంటన్నరసేపు ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి మండుటెండ, తీవ్ర ఉక్కబోతగా ఉన్న వాతావరణం మధ్యాహ్న సమయానికి ఒక్కసారిగా మారిపోయింది. మిన్ను విరిగి మీద పడ్డట్టుగా చల్లని గాలులతో, కరిమబ్బులు కమ్ముకొచ్చాయి. వర్షం ధాటికి నగరంలోని ప్రధాన రహదారులు చెరువులను తలపించాయి. జనజీవనం ఇబ్బందులకు గురైంది.

- కలెక్టర్ కార్యాలయం రోడ్డు, నల్లచెరువు రోడ్డు, అమరావతి రోడ్డు, మంగళగిరి రోడ్డు, చుట్టుగుంట రహదారి, లక్ష్మీపురం, గుజ్జనగుండ్ల, నగరపాలక సంస్థ కార్యాలయం, పల్నాడు బస్టాండ్ ప్రాంతం ఇలా ఏ రోడ్డు చూసినా వాన నీరే. మోకాలి లోతున నీరు ప్రవహించింది. వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. చాలాచోట్ల వాహనాల్లోకి నీరు వెళ్లి అవి మొరాయించాయి.
- ప్రభుత్వ మహిళా కళాశాల రోడ్డు నీట మునిగింది. విద్యార్థినులు మోకాలి లోతున నీటిలో రావాల్సి వచ్చింది.
- కలెక్టరేట్ ప్రాంగణం చెరువులా మారిపోయింది.
- నగరంలోని ప్రధాన మురుగు కాలువల్లో చెత్త, వ్యర్థాలు అడ్డుపడడంతో నీరు ముందుకెళ్లక రోడ్లను ముంచెత్తింది.
- వర్షం తగ్గాక అందరూ ఒకేసారి రోడ్లపైకి రావడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. అరండల్‌పేట పోలీస్‌స్టేషన్ సమీపం నుంచి శంకర్ విలాస్ వంతెన మీదుగా ఏసీ కళాశాల రోడ్డులో, అక్కడి నుంచి ప్రభుత్వ మహిళా కళాశాల మీదుగా నాజ్ కూడలి వెళ్లే మార్గంలో వందలాది వాహనాలు నిలిచిపోయాయి. ట్రాఫిక్ ఓ కొలిక్కి రావడానికి సుమారు గంటకుపైగానే సమయం పట్టింది.
- వర్షాల కారణంగా మిరప, పత్తి పంటలు తరచూ నీటిలో నానుతున్నాయి. మొక్కలు ఉరకెత్తుతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. పత్తి కాయలు కుళ్లిపోతున్నాయి.
- శుక్రవారం ఉదయం నుంచి శనివారం ఉదయం వరకు మంగళగిరి మండలంలో 3.9 సెంటీమీటర్లు, దుగ్గిరాలలో 3, ఫిరంగిపురంలో 2.8, ప్రత్తిపాడులో 2, తాడికొండలో 1.7 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది.


గాంధీ పార్కు సెంటరులో నీటిలో తేలుతున్న కార్లు


మహిళా కళాశాల రోడ్డులో నిలిచిన నీరు


అరండల్‌పేట వద్ద భారీగా నిలిచిన ట్రాఫిక్

రాష్ట్రవ్యాప్తంగా డీపీటీ వ్యాక్సిన్ కొరత

1.50 లక్షల డోసులు కావాలని కేంద్రానికి ఇండెంట్



ఈనాడు, అమరావతి: ఏడాదిన్నర వయసున్న చిన్నారులకు వేయాల్సిన డీపీటీ వ్యాక్సిన్ మొదటి బూస్టర్‌కు రాష్ట్రవ్యాప్తంగా కొరత ఏర్పడింది. గత మూడు నెలలుగా కేంద్రం నుంచి సరఫరా లేకపోవడమే కారణం. ఇది టీకా కార్యక్రమంపై ప్రభావం చూపుతోంది. చాలా మంది చిన్నారులకు మొదటి బూస్టర్ ఇంకా పడలేదు. పెంటావాలెంట్ వ్యాక్సిన్ విషయంలోనూ ఇదే పరిస్థితి ఉంది. దీన్ని చిన్నారులకు 6 వారాల వయసులో మొదటి బూస్టర్‌గా వేస్తారు. 10 వారాలకు రెండోది, 14 వారాల వయసుకు మూడో బూస్టర్ వేస్తారు. ఇదీ అరకొరగానే ఉంది. ప్రస్తుతం గుంటూరు జిల్లాలో వెయ్యికి మించి డీపీటీ వ్యాక్సిన్లు లేవు. 'ఇ-విన్' పోర్టల్‌లో వెదికి ఏ ఆసుపత్రిలో ఉన్నాయో చూసి చిన్నారులకు వేయడానికి వైద్యారోగ్యశాఖ ప్రయత్నిస్తోంది. వ్యాక్సిన్ అందుబాటులో లేదని, రాగానే తమ సిబ్బంది ఫోన్ చేసి సమచారం ఇస్తారని అధికారులు చాలాచోట్ల తల్లులకు చెప్పి పంపిస్తున్నారు. ఈ వ్యాక్సిన్ కొరతకు అనేక కారణాలు చెబుతున్నారు. ఆరేడు మాసాల కిందటే ఇండెంట్ పెట్టాలని, సార్వత్రిక ఎన్నిక హడావుడిలో పడి సకాలంలో ప్రతిపాదించకపోవడం వల్లనే గత మూడు మాసాలుగా పెంటావాలెంట్‌తోపాటు డీపీటీ వ్యాక్సిన్లు అందుబాటులో లేవని కొందరు చెబుతున్నారు. ఈ టీకాలను వినియోగించినట్లు ఎప్పటికప్పుడు 'ఇ-విన్' పోర్టల్‌లో అప్లోడ్ చేయకపోవడం వల్ల ఏ రాష్ట్రంలో ఎంతమేర నిల్వలు ఉన్నాయో కేంద్రానికి తెలియడం లేదని మరో వాదన వినిపిస్తోంది. టీకాల కొరతపై వ్యాక్సినేషన్ అధికారి దేవానందను వివరణ కోరగా మన రాష్ట్రానికి 1.50 లక్షల డోసులు పంపాలని కేంద్రాన్ని కోరినట్టు చెప్పారు. ఇప్పటికే అవి రావాల్సి ఉన్నా.. వర్షాలు, వరదల కారణంగా ఆలస్యమైందన్నారు. దేశవ్యాప్తంగా ఈ సమస్య ఉందని, వారం, పది రోజుల్లో వ్యాక్సిన్లు అందుబాటులోకి వస్తాయని వివరించారు.

నగల వ్యాపారిని బెదిరించి రూ.39.50 లక్షల దోపిడీ

మేదరమెట్ల, న్యూస్‌టుడే: బంగారం కొనుగోలు చేసేందుకు వెళ్తున్న వ్యాపారిని బెదిరించి రూ.39.50 లక్షల నగదు దోచుకున్నారు. కొరిశపాడు మండలం పి.గుడిపాడు సమీపంలోని జాతీయ రహదారిపై శుక్రవారం అర్ధరాత్రి చోటుచేసుకున్న ఈ ఘటనపై పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుంటూరుకు చెందిన పల్లం స్వరూప్‌కు నగల దుకాణం ఉంది. బంగారం కొనుగోలు చేసేందుకు తనకు తెలిసిన వెంకటరమణ గూడ్స్ ట్రాన్స్‌పోర్ట్‌కు చెందిన కంటైనర్ లారీలో చెన్నైకు బయలుదేరారు. పి.గుడిపాడు సమీపంలో అకస్మాత్తుగా లారీకి కొందరు కారు అడ్డు పెట్టారు. స్వరూప్‌ను బెదిరించి కారులో ఎక్కించుకుని. తిమ్మనపాలెం వరకు తీసుకెళ్లి నగదు బ్యాగ్‌ను తీసుకుని పరారయ్యారు. కారులో నలుగురు వ్యక్తులు ఉన్నట్లు బాధితుడు తెలిపారు.

శరవేగంగా డ్రోన్ సమ్మిట్ ఏర్పాట్లు

తాడేపల్లి, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఈ నెల 22 నుంచి 23 వరకు నిర్వహించనున్న అమరావతి డ్రోన్ సమ్మిట్-2024 నిర్వహణకు శరవేగంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. గుంటూరు జిల్లా మంగళగిరి మండలం ఆత్మకూరు వద్ద ఉన్న సీకే కన్వెన్షన్ ఇందుకు సిద్ధం అవుతోంది. జాతీయస్థాయిలో జరిగే ఈ కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను శనివారం రాత్రి మౌలిక సదుపాయాల కల్పన కార్యదర్శి సురేష్‌కుమార్, ఏపీ డ్రోన్ కార్పొరేషన్ ఎండీ దినేష్‌కుమార్‌తోపాటు గుంటూరు కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్పీ సతీష్‌కుమార్ సంయుక్తంగా పరిశీలించారు. ఈ నెల 22వ తేదీ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభించనున్న నేపథ్యంలో వాహనాల క్రమబద్ధీకరణ, వాహన పార్కింగ్, భద్రతా ఏర్పాట్లపై ఉన్నతాధికారులతో చర్చించారు. రెండురోజులు జరిగే కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో హాజరవుతారు. జేసీ భార్గవతేజ, సబ్ కలెక్టర్ సంజనా సింహ, అసిస్టెంట్ కలెక్టర్ స్వప్నిల్ జగన్నాథ్, మంగళగిరి, తాడేపల్లి నగరపాలక కమిషనర్ అలీంబాషా తదితరులు పాల్గొన్నారు.


ఏర్పాట్లపై చర్చిస్తున్న మౌలిక సదుపాయాల కల్పన కార్యదర్శి సురేష్‌కుమార్, కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్పీ సతీష్‌కుమార్

రైలులో సంచార ఆరోగ్య శిబిరం

గుంటూరు రైల్వే, న్యూస్‌టుడే: గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలోని ఉద్యోగుల సౌకర్యార్థం శనివారం రైలులో సంచార ఆరోగ్య శిబిరాన్ని తొలిసారి ఏర్పాటు చేశారు. మొదటిరోజు గుంటూరు నుంచి 07.15 గంటలకు బయలుదేరి రేపల్లెకు 08.30 గంటలకు చేరింది. తిరుగు ప్రయాణంలో ఈ రైలు 11.30 గంటలకు బయలుదేరి వేజెండ్ల, సంగంజాగర్లమూడి, వేమూరు, నందూరు స్టేషన్లతోపాటు మంగళగిరికి మధ్యాహ్నం 2.30 గంటలకు చేరింది. ఈ స్టేషన్లకు వచ్చిన ఉద్యోగులు వారి కుటుంబ సభ్యులకు రైలులోనే వైద్యులు అవసరమైన పరీక్షలు చేసి సలహాలు, సూచనలిచ్చారు.

జీఎంసీలో 10 ఎంబీబీఎస్ సీట్లు ఖాళీ

గుంటూరు వైద్యం: గుంటూరు వైద్య కళాశాల(జీఎంసీ)లో ఇంకా 10 ఎంబీబీఎస్ సీట్లు ఖాళీగా ఉన్నాయి. జాతీయ కోటాలో మొత్తం 37 సీట్లకు 35 భర్తీ అయ్యాయి. ఇప్పటివరకు మూడు రౌండ్లలో విద్యార్థులను కేటాయించారు. అదేవిధంగా రాష్ట్ర కోటాలో 213 సీట్లకు 205 పూర్తయ్యాయి. వచ్చే వారం మూడో రౌండ్ జాబితా విడుదలయ్యే అవకాశం ఉంది. మరోవైపు ఈనెల 14వ తేదీ నుంచి మొదటి ఏడాది ఎంబీబీఎస్ విద్యార్థులకు తరగతులు ప్రారంభమయ్యాయి.

మాజీ ఎంపీ నందిగం సురేష్‌కు వైద్య పరీక్షలు

నగరంపాలెం(గుంటూరు), న్యూస్‌టుడే: ఓ మహిళ హత్య కేసులో నిందితుడిగా ఉన్న మాజీ ఎంపీ నందిగం సురేష్‌కు గుంటూరు సర్వజనాసుపత్రి(జీజీహెచ్)లో శనివారం వైద్య పరీక్షలు నిర్వహించారు. గుంటూరు జిల్లా జైలులో ఉన్న ఆయన్ను జైలు సిబ్బందితోపాటు పోలీసుల బందోబస్తు మధ్య జీజీహెచ్‌కు తరలించారు. వైద్యులు సురేష్‌కు బీపీ, మధుమేహం వంటి పలు పరీక్షలు నిర్వహించి ఎలాంటి సమస్య లేదని నివేదిక ఇవ్వడంతో తుళ్లూరు స్టేషన్‌కు తరలించారు.

పచ్చందాలు పెంచుదాం


రాయపూడి నుంచి హైకోర్టుకు వెళ్లే మార్గం పొడవునా నాటిన మొక్కలు

రాజధాని అమరావతి నిర్మాణ పనుల ప్రారంభానికి బీజం పడింది. సీఆర్డీఏ ప్రాజెక్టు కార్యాలయం పునఃప్రారంభ పనులను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శనివారం పూజలు చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా రాయపూడి వద్ద అఖిల భారత సర్వీసు ఉద్యోగుల భవనాలకు వెళ్లే మార్గంలో దారి పొడవునా మొక్కలు నాటారు. హరితాంధ్రప్రదేశ్‌లో భాగంగా పచ్చదనానికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు సిబ్బంది తెలిపారు.

- ఈనాడు, అమరావతి

హక్కుల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలి

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే: చిన్నారులు, యువత, మహిళలు, వృద్ధుల ప్రాథమిక హక్కుల పరిరక్షణకు అధికారులు చర్యలు తీసుకోవాలని జాతీయ మానవ హక్కుల కమిషన్ యాక్టింగ్ ఛైర్‌పర్సన్ విజయ భారతి సయాని సూచించారు. కలెక్టరేట్‌లోని మినీ శంకరన్ హాలులో శనివారం జిల్లా అధికారులతో సమావేశమయ్యారు. విజయభారతి మాట్లాడుతూ బాలలకు రాజ్యాంగం చదువుకునే హక్కు కల్పించింది. విద్యా సంస్థల్లో పూర్తి స్థాయిలో భద్రత కల్పించాలన్నారు. వృద్ధుల సంక్షేమానికి వైద్య రోగ్య, వివిధ ప్రతిభావంతుల శాఖలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. యాచక వృత్తిలో ఉన్న వారికి షెల్టర్ హోంలు సక్రమంగా నిర్వహించాలన్నారు. మహిళలు అదృశ్యం కావడం చాలా బాధగా ఉందని, జిల్లాలో నమోదైన మహిళల మిస్సింగ్ కేసులపై పూర్తిస్థాయిలో వివరాలు అందించాలని ఐసీడీఎస్ అధికారులను ఆదేశించారు. ఎన్జీవోల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శిశు గృహాలు, షెల్టర్ హోంల జాబితాలను కూడా అందించాలని సూచించారు. దేశంలో జాతీయ మానవ హక్కుల కమిషన్ మాత్రమే ఉందని, సంఘాలు, సంస్థల పేరుతో ఎవరైనా బ్లాక్ మెయిల్‌కు పాల్పడితే ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. తొలుత జేసీ ఎ.భార్గవ్ తేజ జిల్లాలోని విద్యాసంస్థల్లో అమలవుతున్న పథకాల గురించి పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. సమావేశంలో తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సింహ, అసిస్టెంట్ కలెక్టర్ స్వప్నిల్ జగన్నాథ్, జడ్పీ సీఈవో జ్యోతి బసు, సీపీవో శేషశ్రీ, డీసీవో వీరాచారి, డీఈవో శైలజ, డీఎంహెచ్‌వో విజయలక్ష్మీ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎన్‌హెచ్ఆర్సీ యాక్టింగ్ ఛైర్‌పర్సన్ విజయభారతి సయాని

అవగాహన సదస్సు

స్థానిక అమరావతిరోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాలలో మానవ హక్కులు, భారతీయ సంస్కృతి-కళలు-అధ్యయనం అంశాలపై జరిగిన సదస్సులో జాతీయ మానవ హక్కుల కమిషన్ యాక్టింగ్ ఛైర్‌పర్సన్ విజయభారతి సయాని పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యక్తి హక్కులకు భంగం కలిగినప్పుడు ప్రసార మాధ్యమాల ద్వారా విషయం తెలిస్తే మానవ హక్కుల కమిషన్ సుమోటోగా కేసు స్వీకరిస్తుందన్నారు. 1992-93లో కమిషన్‌కు 493 ఫిర్యాదులు అందగా, 2023-24 సెప్టెంబర్ వరకు 68223 అర్జీలు వచ్చాయన్నారు. ఇందులో 68 వేల ఫిర్యాదులను డిస్పోజ్ చేసినట్లు తెలిపారు. అనంతరం ప్రాచీన కళలను ప్రోత్సహిస్తున్న నరసరావుపేటకు చెందిన దుర్గారావు తోలుబొమ్మలాట బృందాన్ని, కొల్లిపర మండలం అత్తోట గ్రామానికి చెందిన కనక ప్రసాద్ చెక్క భజనబృందాన్ని సత్కరించి పారితోషికం అందించారు. కార్యక్రమంలో ఫార్మసీ కళాశాల ఛైర్మన్ జూపూడి రంగరాజు, డాక్టర్ కె.వి.జి.ఎస్.మూర్తి, కళాశాల కరస్పాండెంట్ శివరామకృష్ణమూర్తి, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


జ్యోత్స్న చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న ఆమె భర్త, ప్రముఖ న్యాయవాది సుంకర రాజేంద్రప్రసాద్, కుటుంబ సభ్యులు

మహిళా సాధికారతకు జ్యోత్స్న ఎనలేని కృషి

మంగళగిరి, దుగ్గిరాల, న్యూస్‌టుడే: గుళ్లపల్లి జ్యోత్స్న ఆశయాలను కొనసాగించడమే ఆమెకిచ్చే ఘనమైన నివాళి అని, సమాజానికి ఆమె చేసిన సేవలు ఎనలేనివని వక్తలు పేర్కొన్నారు. ప్రముఖ న్యాయవాది, ఆల్ ఇండియా లాయర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు, ఏపీ బార్ కౌన్సిల్ సభ్యుడు సుంకర రాజేంద్రప్రసాద్ సతీమణి జ్యోత్స్న సంతాప సభ శనివారం మంగళగిరి మండలం ఆత్మకూరు వద్ద ఉన్న సీకే కన్వెన్షన్‌లో జరిగింది. వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు హాజరై నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..'తరుణీ తరంగాలు' ప్రధాన కార్యదర్శిగా, 'సేఫ్' వ్యవస్థాపకురాలిగా జ్యోత్స్న చేసిన సేవలను స్మరించుకున్నారు. మహిళల పక్షాన అలుపెరగని పోరాటం చేశారని గుర్తు చేసుకున్నారు. చిన్ననాటి నుంచి వామపక్ష భావాలతో పెరిగిన ఆమె మహిళా సాధికారతకు ఎంతో కృషి చేశారని, ఆమె మృతి తీరని లోటని పేర్కొన్నారు. జ్యోత్స్న ముందుగానే తీసుకున్న నిర్ణయం మేరకు కుటుంబ సభ్యులు ఆమె శరీరాన్ని మంగళగిరి ఎన్నారై ఆసుపత్రికి దానం చేయడం గొప్ప విషయమని కొనియాడారు. నివాళులర్పించిన వారిలో ఏపీ హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తులు జస్టిస్ శేషసాయి, జస్టిస్ టి.రజని, తెలంగాణ సీనియర్ సివిల్ జడ్జి సీహెచ్ ఆశాలత, మాజీ మంత్రులు వడ్డే శోభనాద్రీశ్వరరావు, దేవినేని ఉమ, మాజీ ఎమ్మెల్యే పాటూరి రామయ్య, మాజీ ఎంపీలు కనకమేడల రవీంద్రకుమార్, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, మధు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, అక్కినేని వనజ, ఎమ్మెల్సీ లక్ష్మణరావు, పౌరహక్కుల సంఘం రాష్ట్ర కార్యదర్శి ముప్పాళ్ల సుబ్బారావు, ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవి, కేరళ హైకోర్టు లాయర్ల సంఘం అధ్యక్షుడు థామస్ అబ్రహం, రామోజీ ఫిలిం సిటీ ఎండీ విజయేశ్వరి, సీపీఎం నేత బాబురావు, విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమా, విజయవాడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చంద్రమౌళి, ప్రధాన కార్యదర్శి శివరాంప్రసాద్, పలువురు పారిశ్రామిక వేత్తలు, విద్యా వేత్తలు, వైద్యులు పాల్గొన్నారు.


హాజరైన జస్టిస్ టి.రజని


పాల్గొన్న ప్రముఖులు

21వ తేదీ నుంచి ఎంఎస్ఎంఈల సర్వే

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే: ఎంఎస్ఎంఈల పనితీరును మెరుగుపర్చేందుకు, అభివృద్ధిని మరింత వేగవంతం చేసేందుకు సర్వే నిర్వహిస్తున్నట్లు జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ ఎ.జయలక్ష్మి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఎస్ఎంఈలలో తయారీ, సేవ, వాణిజ్య రంగాల్లోని అన్నింటిని డిజిటల్ ప్లాట్‌ఫారంలోకి తెచ్చి ఏపీ ఎంఎస్ఎంఈ వన్ అనే పోర్టల్‌కు అనుసంధానించేందుకు వాటి కార్యకలాపాలను ఉద్యమం, ఉద్యమ అసిస్ట్‌లో నమోదు చేస్తున్నట్లు తెలిపారు. సర్వే పైలట్‌లో భాగంగా జిల్లాలోని తెనాలి పట్టణం, మేడికొండూరు మండలాలను ఎంపిక చేసినట్లు తెలిపారు. ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్ల ద్వారా సర్వే పూర్తి చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిపారు. ఈనెల 21 నుంచి ఈ ప్రాంతాల్లో పైలట్‌గా సర్వే ప్రారంభించనున్నట్లు తెలిపారు.

'ఇండియన్ జర్నల్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్' ప్రధాన సంపాదకుడిగా విద్యాధర

గుంటూరు రూరల్, న్యూస్‌టుడే: 'ఇండియన్ జర్నల్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్' ప్రధాన సంపాదకుడిగా చౌడవరం 'చిప్స్' ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సూర్యదేవర విద్యాధర ఎన్నికయ్యారు. ఈ నెల 16న ముంబయి ఐపీఏ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఎన్నికల నిర్వహణ అధికారి డాక్టర్ రావు వడ్లమూడి నుంచి నియామకం పత్రం అందుకుని ప్రమాణస్వీకారం చేశారు. ఈ బాధ్యతలు స్వీకరించడం గౌరవప్రదంగా భావిస్తున్నట్లు విద్యాధర పేర్కొన్నారు. కళాశాల యాజమాన్యం డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, కార్యదర్శి డాక్టర్ సీఎన్ శ్రీనివాస్, కోశాధికారి రాయపాటి గోపాలకృష్ణ, అధ్యాపక, సిబ్బంది ఆయన్ను అభినందించారు


నియామక పత్రం అందుకుంటున్న డాక్టర్ విద్యాధర

గుంటూరులో నల్గొండ పోలీసుల తనిఖీలు..?

రేషన్ బియ్యం అక్రమంగా తరలించిన వ్యక్తి కోసం గాలింపు

కలెక్టరేట్(గుంటూరు) : రేషన్ బియ్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేసి తెలంగాణలోని మిల్లులకు తరలించి..అక్కడ పాలిష్ చేసి ఇతర రాష్ట్రాలకు రవాణా చేస్తున్న వ్యక్తి కోసం శనివారం గుంటూరులో నల్గొండ జిల్లా పోలీసులు తనిఖీలు నిర్వహించినట్లు సమాచారం. ఇటీవల నల్గొండ జిల్లాలోని రైస్ మిల్లులో రేషన్ బియ్యాన్ని పాలిష్ చేసి ఇతర రాష్ట్రాలకు రవాణా చేస్తున్న వారిని అక్కడి పోలీసులు పట్టుకున్నారు. ఈ క్రమంలోనే రూ.18 లక్షల విలువైన రేషన్ బియ్యాన్ని పట్టుకుని నిందితులను అరెస్ట్ చేశారు. అందులో బాపట్ల జిల్లాకు చెందిన చీమకుర్తి సుధాకర్‌ను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం గుంటూరులో రేషన్ బియ్యాన్ని తరలించే వ్యక్తి కోసం అక్కడి నుంచి పోలీసులు గుంటూరు వచ్చారు. గుంటూరులో అతని కోసం తనిఖీలు నిర్వహించగా..పరారీలో ఉన్నట్లు గుర్తించి పోలీసులు వెనుదిరిగినట్లు తెలిసింది.

నెయ్యి స్వచ్ఛమైందని నివేదిక సమర్పించాలి

దేవాదాయశాఖ కమిషనర్ సత్యనారాయణ

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే: దేవాదాయ శాఖలో చేపట్టిన సంస్కరణల్లో భాగంగా ప్రసాదం తయారీలో వాడే నెయ్యి ప్రయోగశాల పరీక్షల్లో స్వచ్ఛమైందని రుజువు నివేదిక సమర్పించాలని టెండర్ల నిబంధనల్లో పేర్కొననున్నట్లు రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ శ్రీరామ సత్యనారాయణ తెలిపారు. గుంటూరు జిల్లా తెనాలి వైకుంఠపురంలోని శ్రీలక్ష్మీ పద్మావతీ సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానాన్ని ఆయన శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ రాష్ట్రంలోని శ్రీశైలం, శ్రీకాళహస్తి, కాణిపాకం, సింహాచలం, అన్నవరం, ద్వారకాతిరుమల, విజయవాడ కనకదుర్గమ్మ ఆలయాలతోపాటు 6 ఏ దేవాలయాల్లో ప్రసాదం తయారీకి 14 వేల మెట్రిక్ టన్నుల నెయ్యి అవసరమని, దీనిని సహకార రంగంలోని విజయ, నందిని, సంగం డెయిరీల నుంచి కొంటున్నట్లు పేర్కొన్నారు. ఆలయాల్లో త్వరలో కొలువు దీరనున్న నూతన ధర్మకర్తల మండలిలో బ్రాహ్మణులకు సముచిత స్థానం కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించిందని, ఈ మేరకు వచ్చే మంత్రి మండలిలో ఆర్డినెన్స్ కూడా తీసుకువస్తారని ఆయన వివరించారు. మతవిశ్వాసాల్లో ప్రభుత్వ అధికారుల ప్రమేయం లేకుండా ఉండేందుకుగాను జీవో నంబరు 223 తీసుకువచ్చినట్లు ఆయన చెప్పారు. అర్చక స్వాములకు ఇప్పటికే ఇస్తున్న కనీస వేతనం రూ.5వేలను, రూ.10వేలకు పెంచాలని నిర్ణయించినట్లు, ఈ మేరకు త్వరలో జీవో కూడా విడుదల కానుందన్నారు. ఈ సందర్భంగా ఆయన ఆలయానికి వచ్చిన భక్తులతో మాట్లాడారు. లడ్డూ, అన్నప్రసాదం, దైవ దర్శనాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ ఉప కమిషనర్ కె.బి.శ్రీనివాసరావు, జిల్లా సహాయ కమిషనర్ జి.మాధవి, ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాసరావు, శారద పాల్గొన్నారు.


వెంకన్న సన్నిధిలో పూజ చేస్తున్న దేవాదాయశాఖ కమిషనర్ శ్రీరామ సత్యనారాయణ, ఉప కమిషనర్ కె.బి.శ్రీనివాసరావు

సౌత్‌జోన్ అథ్లెటిక్స్ ఓవరాల్ ఛాంపియన్ తమిళనాడు

ఎ.ఎన్.యు, న్యూస్‌టుడే: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో నిర్వహిస్తున్న 35వ సౌత్‌జోన్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీలు శనివారంతో ముగిశాయి. 347 పాయింట్లు సాధించి తమిళనాడు రాష్ట్రం ఓవరాల్ ఛాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకుంది. పురుషుల, మహిళల ఛాంపియన్‌షిప్‌లను సైతం తమిళనాడే దక్కించుకుంది. ఈ పోటీల్లో అగ్రస్థానంలో తమిళనాడు నిలవగా.. తరవాత స్థానాల్లో కర్ణాటక, తెలంగాణ, ఏపీలు నిలిచాయి.

❖ అండర్-14 బాలుర విభాగంలో తెలంగాణ మొదటి స్థానంలో నిలవగా..ఏపీ రెండో స్థానాన్ని కైవసం చేసుకుంది. అండర్-16 బాలుర విభాగంలో తెలంగాణ, కర్ణాటక, అండర్-18 బాలుర విభాగంలో కర్ణాటక, తమిళనాడు, అండర్-20 బాలుర విభాగంలో తమళనాడు, కర్ణాటక రాష్ట్రాలు నిలిచాయి. ❖ అండర్-14, అండర్ -16, అండర్ -18, అండర్ -20 బాలికల విభాగంలో తమిళనాడు, కర్ణాటకలే తొలి రెండు స్థానాలలో నిలిచాయి. ❖ వ్యక్తిగత విభాగంలో అండర్-14 బాలుర విభాగంలో తెలంగాణ క్రీడాకారుడు రాథోడ్ కార్తీక్, అండర్-16 బాలుర విభాగంలో కర్ణాటక క్రీడాకారుడు ఆయుష్, అండర్-18 బాలుర విభాగంలో కర్ణాటక క్రీడాకారుడు దయానంద్, అండర్ -20 బాలుర విభాగంలో ఏపీ క్రీడాకారుడు షేక్ రోషన్ పతకాలు దక్కించుకున్నారు.

❖ అండర్-14 బాలికల విభాగంలో తమిళనాడు క్రీడాకారిణి ఆర్తి, అండర్-16 బాలికల విభాగంలో ఏపీ క్రీడాకారిణి డింపుల్ మహాశ్రీ, అండర్ -18 బాలిక విభాగంలో కర్ణాటక క్రీడాకారిణి శృతిశెట్టి, అండర్-20 బాలికల విభాగంలో తమిళ క్రీడాకారిణి శ్రీ వర్ధిణికి పతకాలు వరించాయి. విజేతలకు భారత క్రీడా సమాఖ్య ఈసీ సభ్యురాలు హైమావతి, సంయుక్త కార్యదర్శి రాఘవేంద్ర, ఏపీ అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గౌతమ్‌కిరణ్ బహుమతులు ప్రదానం చేశారు.



ఛాంపియన్‌షిప్ ట్రోఫీని అందుకున్న తమిళనాడు పురుషుల జట్టు, నిర్వాహకులు

'ఈనాడు' లక్ష్య క్రీడాకారులకు పతకాలు

ఎ.ఎన్.యు, న్యూస్‌టుడే: గుంటూరు జిల్లా ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో నిర్వహించిన 35వ సౌత్ జోన్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో 'ఈనాడు' సీఎస్ఆర్ కార్యక్రమం లక్ష్య క్రీడాకారులు సత్తా చాటారు. మొత్తం మూడు పతకాలు సాధించారు. పురుషుల అండర్-18లో షేక్ హమీద్ మిడ్ రిలేలో రజతం, అండర్-20 విభాగంలో 100 మీటర్లు, 110 మీటర్ల హర్డిల్స్‌లో షేక్ రోషన్ బంగారు పతకాలు సాధించారు. ఈ సందర్భంగా క్రీడాకారులు న్యూస్‌టుడేతో మాట్లాడుతూ ఒలింపిక్స్‌లో పతకం, ప్రభుత ఉద్యోగం సాధించడమే తమ లక్ష్యమన్నారు. కోచ్ రవి ఆధ్వర్యంలో షేక్ రోషన్ ఇప్పటికే జాతీయ స్థాయిలో 20, మూడు సార్లు ఉత్తమ క్రీడాకారుడిగా పతకాలు సాధించారు. షేక్ హమీద్ రాష్ట్రస్థాయిలో 10 పతకాలను తన ఖాతాలో వేసుకున్నారు. ఈనాడు లక్ష్య కార్యక్రమం వల్లే తాము ఇన్ని పతకాలు సాధించామని క్రీడాకారులు వెల్లడించారు.


షేక్ హమీద్


షేక్ రోషన్

రూ.2.5 కోట్ల నిధులతో ఉపాధి పనులకు శ్రీకారం

కొల్లిపర, న్యూస్‌టుడే: పల్లె ప్రగతికి రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ బృహత్తర ప్రణాళికను రూపొందించారని పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా శనివారం కొల్లిపర మండలంలో రూ.2.5 కోట్ల ఉపాధి నిధులతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ. . రాష్ట్రంలోని 13362 పంచాయితీల్లో రూ.4500 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామని పేర్కొన్నారు. వ్యవసాయరంగానికి కొల్లిపర మండలం తలమానికమని, మండలాన్ని అగ్రికల్చర్ హబ్‌గా రూపొందిస్తామని హామీ ఇచ్చారు. ప్రతి ఇంటికి రక్షిత నీటిని అందిస్తామన్నారు. యువత ఉపాధి దిశగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. పర్యటనలో జనసేన మండల అధ్యక్షుడు వై.వెంకయ్య నాయుడు, కె.శ్రీహరి, పి.సుబ్బారావు, ఎం.వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.


సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న మంత్రి నాదెండ్ల

22న సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమం

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే: ఈనెల 22న డెల్టా పరిధిలోని 14 మండలాల్లో వరి పంటలో సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి నున్నా వెంకటేశ్వర్లు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రతి రైతు సేవా కేంద్రం వద్ద విషపు ఎరను తయారు చేసి రైతులకు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఈ మందును నూరు శాతం రాయితీపై వ్యవసాయ శాఖ సరఫరా చేస్తుందని, అవసరమైన నూనె, నూకలను రైతులు సమకూర్చుకోవాలని తెలిపారు.

అమరావతికి రుణాలిచ్చి సహకరించండి

తుళ్లూరు, న్యూస్‌టుడే: అమరావతి అభివృద్ధికి త్వరితగతిన నిధులు ఇచ్చి సహకరించాలని ప్రపంచ బ్యాంకు ప్రతినిధులను రాజధాని రైతులు కోరారు. తుళ్లూరు సీఆర్డీఏ ప్రాంతీయ కార్యాలయంలో శనివారం ప్రపంచ బ్యాంకు ప్రతినిధులు తాడేపల్లి మండలం పెనుమాక, ఉండవల్లి, మంగళగిరి మండలం నిడమర్రు రైతులతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ల్యాండ్ పూలింగ్, ప్లాట్ల కేటాయింపు తదితర వివరాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. తమ ప్రాంతం విజయవాడ, మంగళగిరి పట్టణాలకు దగ్గరలో అర్బన్ ఏరియాలో ఉన్నందున ప్యాకేజీ కొంత పెంచి ఇస్తే బాగుంటుందని రైతులు అభిప్రాయపడ్డారు. సీఆర్డీఏ ద్వారా త్వరితగతిన ప్లాట్ల కేటాయింపులు, రిజిస్ట్రేషన్‌లు చేస్తే రైతులు భూములు ఇవ్వటానికి సుముఖంగా ఉన్నారని తెలిపారు. రాజధాని నిర్మాణానికి తామంతా భూములు ఇవ్వాలని నిర్ణయించుకున్నామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రపంచ బ్యాంకు సామాజిక విభాగం ప్రతినిధులు బాయన వెంకటరావు, రంజన్ వర్మ, సీఆర్డీఏ సామాజిక విభాగం గ్రూప్ డైరెక్టర్ కృష్ణ మోహన్, డీసీడీఓ బొర్రా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


ప్రపంచ బ్యాంకు ప్రతినిధులతో రాజధాని రైతులు

మార్ఫిన్ మాత్రల కొనుగోలుకు మార్గం సుగమం

ఈనాడు కథనానికి స్పందన

గుంటూరు వైద్యం, న్యూస్‌టుడే: క్యాన్సర్ తీవ్రంగా ముదిరిన దశలో నొప్పితో బాధపడేవారికి ఇచ్చే మార్ఫిన్ మాత్రలు సర్వజనాసుపత్రిలో కొద్ది రోజుల్లోనే అందుబాటులోకి రానున్నాయి. ఈనాడులో ఈనెల 19న 'నొప్పి తెలియడం లేదా?' శీర్షికన కథనం ప్రచురితమైంది. ఇందులో తీవ్రమైన నొప్పిని కూడా సమర్థంగా తగ్గించే 'మార్ఫిన్ మాత్రలు' సర్వజనాసుపత్రిలో గత ఏడాది నుంచి అందుబాటులో లేవని, వీటిని సరఫరా చేసే గుత్తేదారుకు బకాయిలున్నందున ఆ మాత్రలు ఇవ్వడం లేదని వివరించడం జరిగింది. దీనిపై స్పందించిన సూపరింటెండెంట్ కిరణ్‌కుమార్ కాంట్రాక్టరు బకాయి రూ.లక్ష శనివారమే చెల్లించేలా ఆదేశాలిచ్చారు. దీంతో గుత్తేదారు ఆ మాత్రలు సరఫరా చేసేందుకు ముందుకొచ్చారు. సర్వజనాసుపత్రిలో నిధులు అందుబాటులో ఉన్నప్పటికీ కాంట్రాక్టరుకు బకాయిలు చెల్లించకుండా ఉద్దేశపూర్వకంగా జాప్యం చేసిన ఉద్యోగులపై ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాల్సి ఉంది.

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 130, రిటైల్ ధర - 152, చికెన్ విత్‌స్కిన్ - 220, చికెన్ స్కిన్‌లెస్ - 251.
కృష్ణా జిల్లాలో: వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -130 రిటైల్ ధర 152 చికెన్ విత్ స్కిన్ - 220, చికెన్ స్కిన్‌లెస్ - 251.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 135, 145, 155 చికెన్ విత్ స్కిన్ - 260 చికెన్ స్కిన్‌లెస్ - 270.

నెక్ సూచించిన కోడిగ్రుడ్ల ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 510 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.95/-.



నిర్లక్ష్యం.. వాహనాలు నిరుపయోగం

గ్రామాల్లో పొడి, తడిచెత్త వేర్వేరుగా సేకరించేందుకు గతంలో స్వచ్ఛ భారత్ పథకంలో భాగంగా పంచాయతీలను ప్రభుత్వం రిక్షాలను అందజేసింది. కొంత కాలం చెత్తను సేకరించేందుకు వాటిని వినియోగించారు. అవి చిన్న పాటి మరమ్మతులకు లోను కావడంతో మూలన పడేశారు. ప్రస్తుతం అవి తుప్పు పట్టి పాడవుతున్నాయి. - న్యూస్‌టుడే, చేబ్రోలు

తెనాలి

•తెనాలి •పొన్నూరు

రాజధాని నిర్మాణానికి చెక్కు అందజేత

పొన్నూరు, న్యూస్‌టుడే: అమరావతి రాజధాని నిర్మాణ పనులకు పొన్నూరు మండల పరిధిలోని వల్లభరావుపాలేనికి చెందిన బండారుపల్లి సావిత్రి పింఛన్లకు సంబంధించిన రూ.11 వేలు చెక్కును శనివారం గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఆమెను ఎమ్మెల్యే అభినందించారు



ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్‌కు చెక్కు అందచేస్తున్న బండారుపల్లి సావిత్రి



విజేతలతో విద్యా సంస్థల ఛైర్మన్ డాక్టర్ రావిపాటి వీరనారాయణరావు, ఉపాధ్యాయులు



వ్యాస రచన పరీక్షకు పెద్ద సంఖ్యలో హాజరైన విద్యార్థులు

సృజనకు పదును.. భవితకు ఆదర్శం

'ఈనాడు' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు

తెనాలి టౌన్, న్యూస్‌టుడే

స్థానిక బుర్రిపాలెం రోడ్డులోని శ్రీవివేకానంద సెంట్రల్ పాఠశాల్లో శనివారం 'ఈనాడు' ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రతిభా పాటవ పోటీలకు విశేష స్పందన లభించింది. 'అంతర్జాల వినియోగంలో లాభనష్టాలు, విద్యార్థులపై సామాజిక మాధ్యమాల ప్రభావం' అంశంపై జరిగిన వ్యాసరచన పోటీల్లో 8, 9, 10 తరగతుల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. షేక్.ఆరిఫా (పదో తరగతి) ప్రథమ, కె.పరిమళ (తొమ్మిదో తరగతి) ద్వితీయ, షేక్.ఆయేషా (తొమ్మిదో తరగతి) తృతీయ స్థానాలు పొందగా విద్యా సంస్థల అధినేత డాక్టర్ రావిపాటి వీరనారాయణరావు విజేతలకు బహుమతులు, ధ్రువపత్రాలు అందించారు. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కె.రామరాజు, సీఈవో ఆర్.వెంకట్రామ్, డీన్ పద్మజ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నందులపేటలో సమస్యల తిష్ఠ

గత వైకాపా హయాంలో అసంపూర్తిగా పనులు

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే:

పట్టణంలోని నందులపేటలో సమస్యలు పేరుకుపోయాయి. ఈ ప్రాంతంలో గత వైకాపా ప్రభుత్వ హయాంలో టెండర్లు దక్కించుకున్న గుత్తేదారులు పనులను మధ్యలో వదిలేయడంతో జనం అవస్థలు పడుతున్నారు. కాలువలు పొంగి రహదారులపైకి మురుగు చేరి దుర్వాసన వ్యాపిస్తుండడంతో విష జ్వరాలతో ప్రజలు బాధపడుతున్నారు.



నిరుపయోగం మరుగుదొడ్లు



భూగర్భంలో పైపులువేసి పూడ్చాక కాంక్రీటు వేయని రహదారి

రోడ్డుపై నిల్చోని..

ఈపూరు, చిలుమూరు, కొల్లిపర వెళ్లే బస్సులు ఆగే బస్‌షెల్టర్‌ను తరచూ శుభ్రం చేయించక రోడ్డుపై నిల్చోవాలిసి వస్తుందని ప్రయాణికులు వాపోతున్నారు. ఐతానగర్ ఎస్‌బీఐ శాఖ పక్క సందులో నాలుగేళ్ల కిందట భూగర్భంలో తాగునీటి పైపులు కోసం మట్టి తవ్వి దానిపైన కాంక్రీటు వేయకుండా వదిలేయడంతో రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. ఈ పని కోసం కొన్న 13,724 మీటర్ల పైపులకు గాను 10,180 మీటర్లు వినియోగించగా మిగిలిన వాటి ఆచూకీ లేకున్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు ఉన్నారు. మున్సిపాలిటీ ఆధ్వర్యంలో నరేంద్రదేవ్ కాలనీలో మురుగుదొడ్లకు వాడుక నీరు సరఫరా కోసం వేయించిన చేతి పంపు, మోటారు మొరాయించాయి. వీటిని శుభ్రం చేయక వినియోగానికి దూరంగా ఉన్నాయి. ఈ పనుల టెండరు దక్కించుకున్న గుత్తేదారు అనుకూలురు కావడంతో అధికారులు వాటి వంక కన్నెత్తి చూడడం లేదని స్థానికులు వాపోతున్నారు.

ఖాళీ స్థలాలతో ఇబ్బంది..

బీసీ కాలనీ సమీపంలోని సుమారు 3 ఎకరాల మున్సిపల్ రిజర్వ్ స్థలంలో తెనాలి రెవెన్యూ అధికారులు ఇద్దరికి ఇళ్ల పట్టాలు ఇచ్చారు. నాటి తహసీల్దారు నిర్వాహకంతో ఈ స్థలం వివాదంలో చిక్కుకుంది. అప్పటి నుంచి అందులో పిచ్చి మొక్కలు పెరిగి ఇళ్లల్లోకి విషపురుగులు వస్తున్నాయని ఇరుగుపొరుగు వారు ఆందోళన చెందుతున్నారు.

కాలువలు నిర్మించక..

పెమస్మాని పెట్రోలు బంకు నుంచి బుర్రిపాలెం రోడ్డులోని కంపోస్టు యార్డు వరకు మురుగు కాలువకు గోడల నిర్మాణ పనులు దక్కించుకున్న గుత్తేదారు పనులు మొదలు పెట్టలేదు. ఈటీ కాలనీలో ఎన్టీఆర్ రోడ్డు పక్కన కాలువ నిర్మించక మురుగు పొంగి రోడ్డు పైకి చేరి దుర్గంధం వ్యాపిస్తోంది.

నీటి సౌకర్యం కల్పించాలి



మరుగుదొడ్లకు నీటి లభ్యత కోసం మరమ్మతులు చేయించాలి. నీరు లేకపోవడం వల్ల వాటిని నిరుపయోగంగా వదిలేస్తున్నారు. - టి.అమరేంద్ర, నరేంద్రదేవ్ కాలనీ

వీధి కుక్కల బెడద



వీధి కుక్కలు గుంపులుగా వీధుల్లో తిరుగుతున్నాయి. రాత్రుళ్లు రోడ్ల పై వెళ్లాలంటే ఇబ్బందిగా ఉంది. ఇళ్ల మధ్య ఖాళీ స్థలాల్లో పెరిగిన పిచ్చి మొక్కల్లో నుంచి విష పురుగులు ఇళ్లల్లోకి వస్తున్నాయి. అధికారుల దృష్టికి తీసుకెళ్లినా చూద్దాం, చేద్దామంటున్నారు. - ఫణీంద్ర, ఈటీ కాలనీ..

పట్టభద్రులు ఓటు నమోదు చేసుకోవాలి

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: గుంటూరు, కృష్ణా జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు తెనాలిలో మంచి మెజారిటీ రావాలని తెదేపా పట్టణ అధ్యక్షుడు తాడిబోయిన హరిప్రసాద్ పేర్కొన్నారు. స్థానిక తెదేపా కార్యాలయంలో శనివారం నిర్వహించిన నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పట్టభద్రులు ఓటు నమోదును వేగవంతం చేయాలని సూచించారు. ఖుద్దూస్, కోటేశ్వరరావు, మహేష్, రమ్య, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

ఫెన్సింగ్ క్రీడా పోటీలు ప్రారంభం

నంబూరు(పెదకాకాని), న్యూస్‌టుడే: జేఎన్‌టీయూ కాకినాడ సెంట్రల్ జోన్ అంతర్ కళాశాల క్రీడా పోటీల్లో భాగంగా శనివారం నంబూరు వీవీఐటీ కళాశాలలో ఫెన్సింగ్ పోటీలను టోర్నమెంటు సెక్రటరీ డాక్టర జీపీ రాజు ప్రారంభించారు. ఈ పోటీల్లో 16 కళాశాలల నుంచి 32మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఎస్ఆర్‌కేఆర్ విద్యార్థి ఎం.వెంకటేష్, కిట్సు కళాశాలకు చెందిన పి.సృజన్ సిన్హా, చలపతి కళాశాలకు చెందిన కె.రత్నకుమారి ప్రథమస్థానంలో విజేతలుగా నిలిచారు. వీవీఐటీ అకడమిక్ డీన్ డాక్టర్ కె.గిరిబాబు, ఈవెంట్ ఆర్గనైజర్ డాక్టర్ ఎన్ అరుణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

రోటరీ సేవలు మరింత విస్తరిస్తాం

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: రోటరీ సేవలను మరింత విస్తరిస్తామని ఈ మేరకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు రోటరీ అంతర్జాతీయ జిల్లా గవర్నర్ కాట్రగడ్డ శరత్ చౌదరి పేర్కొన్నారు. ఆయన రోటరీ క్లబ్ తెనాలి, వైకుంఠపురం, హైదరాబాద్ జూబ్లీహిల్స్ క్లబ్ సంయుక్తంగా తెనాలి పట్టణంలో శనివారం చేపట్టిన సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. స్థానిక పురపాలక బాలురోన్నత పాఠశాల్లో డైనింగ్ హాల్, సైకిల్ స్టాండ్ పనులకు శంకుస్థాపన చేశారు. తెనాలి, పరిసర ప్రాంతాల్లోని వీహెచ్‌సీలకు, దివ్యాంగులకు 25 వీల్‌ఛైర్లను, మూడు ఇస్త్రీ పెట్టెలను పంపిణీ చేశారు. ఈ.శ్రీనివాసరావు, వెంకటశివరాంప్రసాద్, రత్నప్రభాకర్, శివరంజని, డాక్టర్ జీవనలత తదితరులు పాల్గొన్నారు.



పాఠశాలలో డైనింగ్ హాల్‌కు శంకుస్థాపన చేస్తున్న రోటరీ ప్రతినిధులు

పొన్నూరు, న్యూస్‌టుడే: రోటరీ క్లబ్ అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తామని రోటరీక్లబ్ జిల్లా గవర్నర్ కాట్రగడ్డ శరత్ చౌదరి పేర్కొన్నారు. నిడుబ్రోలులోని టిడ్కో గృహాలు వద్ద శనివారం రోటరీ క్లబ్ సభ్యులు మొక్కలు నాటారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రోటరీక్లబ్ ఆధ్వర్యంలో పేద రోగులు కోసం డయాగ్నస్టిక్ ల్యాబ్, డయాలసిస్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. రోటరీక్లబ్ అధ్యక్షుడు రవి రాకేష్ దేవ్, బాలకృష్ణ, కమిషనర్ ఎం.రమేషుబాబు, తదితరలు పాల్గొన్నారు.

గ్రామాల్లో అభివృద్ధి పనులకు శ్రీకారం

పొన్నూరు, న్యూస్‌టుడే: ప్రజల కోరిక మేరకు గ్రామాల్లో వివిధ అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామని ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ పేర్కొన్నారు. మండల పరిధిలోని ములుకుదురు, నండూరు, వల్లభరావుపాలెం, ఉప్పరపాలెం గ్రామంలో శనివారం నిర్వహించిన పల్లె పండుగ కార్యక్రమంలో పాల్గొని వివిధ అభివృద్ధి పనులకు భూమి పూజ చేసి శిలాఫలకం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత వైకాపా ప్రభుత్వం రైతులకు వ్యతిరేకంగా ప్రవేశ పెట్టిన చట్టాలను కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే వాటిని రద్దు చేశామని వెల్లడించారు. కూటమి ప్రభుత్వం త్వరలోనే అర్హులైన వారికి సంక్షేమ పథకాలు అందిస్తామని తెలిపారు. నాయకులు వి.మార్కండేయ బాబు, ఎం.వెంకటేశ్వర్లు, బి.రామారావు, బి.బాబురావు తదితరులు పాల్గొన్నారు.



ములుకుదురులో శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర

విన్యాసాలు అదుర్స్

ఈ నెల 17 నుంచి 19 వరకు బాపట్లలోని వివేకానంద భవన్‌లో నిర్వహించిన మల్లకంబ క్రీడా శిబిరంలో తమ పాఠశాల నుంచి 12 మంది విద్యార్థుల బృందం వెళ్లి శిక్షణ పొందిందని స్థానిక పురపాలక బాలురోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సుందరరావు శనివారం తెలిపారు. మల్లకంబ విశ్వగురువుగా గుర్తింపు పొందిన ఉదయ్ విశ్వనాథ్ దేశ్‌పాండేజీ ఈ శిబిరాన్ని నిర్వహించారని పేర్కొన్నారు. విద్యార్థులను వ్యాయామ ఉపాధ్యాయిని ప్రసాదకుమారి, ఉపాధ్యాయులు అభినందించారు. - న్యూస్‌టుడే, తెనాలి టౌన్



విద్యార్థుల విన్యాసం

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

తెనాలి : 80085 73125 పొన్నూరు : 80085 73144

సమస్యల పరిష్కారం

స్పందనకు వందనం

- తెనాలి పట్టణంలోని మారీసుపేట శివాలయం బజారు, నందులపేట కవిరాజాపార్కు రోడ్డులో వీధి దీపాలు వెలగడం లేదని స్థానికులు 'ఈనాడు' ద్వారా ఈ నెల 19న మున్సిపల్ అధికారులకు తెలియచేయగా సమస్యలు పరిష్కారం అయ్యాయి.
- పొన్నూరు వైష్ణవినగర్‌లోని మురుగుకాలువలో వ్యర్థాలు పేరుకుని దుర్వాసన వస్తుందన్న విషయంపై శనివారం ఈనాడులో మేమున్నాం...మీకు తోడుగా శీర్షికన వార్త ప్రచురితమైంది. స్పందించిన ప్రజారోగ్యశాఖ అధికారులు మురుగు కాలువలోని వ్యర్థాలను తొలగించారు. - న్యూస్‌టుడే, తెనాలి టౌన్, పొన్నూరు

పోషకాహార కిట్ల పంపిణీ

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే: దాతల సహకారంతో తెనాలి జిల్లా ఆసుపత్రి ఏఆర్‌టీ సెంటరుకు వచ్చిన హెచ్.ఐ.వి. చిన్నారులకు పోషకాహార కిట్లను పంపిణీ చేసినట్లు శ్రీ శివలింగేశ్వర స్వామి భక్త బృంద సేవాసమితి వారు శనివారం ప్రకటనలో తెలిపారు.

విద్యాధర్‌కు అభినందనలు

చేబ్రోలు, న్యూస్‌టుడే: చేబ్రోలుకు చెందిన విద్యావేత్త చేబ్రోలు హనుమయ్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫార్మాసూటికల్ సైన్సు కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న డాక్టర్ సూర్యదేవర విద్యాధర్ ఇండియన్ జర్నల్ ఆఫ్ ఫార్మా సూటికల్ సైన్సెస్‌కు ప్రధాన సంపాదకులుగా ఎన్నికైన సందర్భంగా స్థానిక ప్రెసిడెన్సీ ప్రైవేటు ఉన్నత పాఠశాల డైరెక్టర్ బన్‌బాబు అభినందనలు తెలిపారు. ఇటీవల ముంబయిలో జరిగిన ఇండియన్ ఫార్మాసూటికల్ అసోసియేషన్‌కు నిర్వహించ ఎన్నికల్లో ఆయన గెలుపొందారన్నారు.

స్పెషల్ కేటగిరీ అభ్యర్థుల పత్రాలు పరిశీలన

ఎ.ఎన్.యు, న్యూస్‌టుడే: ఏపీలోని న్యాయ కళాశాలలో ప్రవేశాల కోసం స్పెషల్ కేటగిరి అభ్యర్థుల విద్యా పత్రాలను శనివారం ఏఎన్‌యూలో పరిశీలించారు. మొత్తం 126 మంది అభ్యర్థులు హాజరయ్యారు. సీఏపీ 12, విభిన్న ప్రతిభావంతులు 37, స్పోర్ట్స్ కోటాలో 40 మంది అభ్యర్థులు తమ విద్యా పత్రాల పరిశీలనలో పాల్గొన్నారు. లా సెట్ కన్వీనర్ ఆచార్య సత్యనారాయణ ఆధ్వర్యంలో పత్రాలను పరిశీలించారు.



చేబ్రోలులో ఆగిన వాహనాలు

ఆక్రమణలతో ట్రాఫిక్‌కు అంతరాయం

ముందు వెళ్తున్న వాహనం ఐదు నిముషాలు ఆగిందంటే చాలు వెనుక వందల సంఖ్యలో వాహనాలు ఆగిపోతున్నాయి. మండల కేంద్రం చేబ్రోలు బస్టాండు సెంటర్లో తోపుడు బండ్లు, ఆటోలు అడ్డుగా పెట్టడంతో వాహనం పక్కగా వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నామని వాహనదారులు వాపోతున్నారు. పోలీసులు ట్రాఫిక్‌ను నియంత్రించాలని స్థానికులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, చేబ్రోలు

నైపుణ్య గణన ప్రారంభం

ఎ.ఎన్.యు, న్యూస్‌టుడే: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో శనివారం నైపుణ్య గణన నిర్వహించారు. ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నైపుణ్య గణనను ప్రారంభించారు. కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్, ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థుల నుంచి వివరాలు సేకరించారు. విద్యార్థుల చరవాణులకు నైపుణ్యం యాప్ ఇన్‌స్టాల్ చేయించారు. అనంతరం విద్యార్థులతోనే వారికి ఎలాంటి నైపుణ్యాలు కావాలనే వివరాలను వాళ్లే పూరించారు. ఈ సందర్భంగా ఏఎన్‌యూ నైపుణ్య గణన అధికారి షేక్ మహ్మద్ రఫి మాట్లాడుతూ విద్య, ఉపాధి అవకాశాల మధ్య అంతరాలను తగ్గించేందుకు నైపుణ్య గణన ఉపయోగపడుతోందన్నారు. కార్యక్రమంలో తౌసీఫ్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న అధికారులు

సమాజాభివృద్ధికి విద్యార్థులు కృషి చేయాలి

ఎ.ఎన్.యు, న్యూస్‌టుడే: విద్యార్థులు సమాజాభివృద్ధికి కృషి చేయాలని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఇన్‌ఛార్జి వీసీ ఆచార్య గంగాధర్ పిలుపునిచ్చారు. ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం(పీడీఎస్‌యూ) స్థాపించి 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా తెలంగాణలోని ఉస్మానియ విశ్వవిద్యాలయంలో భారీ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఆ కార్యక్రమానికి సంబంధించిన గోడ పత్రికలను వీసీ ఆచార్య గంగాధర్ శనివారం ఆవిష్కరించారు. పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు రాజశేఖర్ మాట్లాడుతూ మహోన్నత లక్ష్యాల కోసం 50ఏళ్ల క్రితం తమ సంఘం ప్రారంభమైందన్నారు. ఓయూలో నిర్వహించే కార్యక్రమానికి విద్యార్థులంతా తరలిరావాలని పిలుపునిచ్చారు. పీడీఎస్‌యూ ప్రధాన కార్యదర్శి భాస్కర్, ఉపాధ్యక్షులు సునీల్, రాష్ట్ర సహాయ కార్యదర్శులు నాని, రాజేశ్, మానస తదితరులు పాల్గొన్నారు.



గోడపత్రికలను ఆవిష్కరిస్తున్న వీసీ ఆచార్య గంగాధర్ తదితరులు



కానుకలను లెక్కిస్తున్న భక్తులు

మల్లన్న హుండీ ఆదాయం రూ.40,49,823

పెదకాకాని, న్యూస్‌టుడే: పెదకాకాని మల్లేశ్వర స్వామి దేవస్థాన హుండీల్లోని కానుకలను శనివారం లెక్కించగా ఆదాయం రూ.40,49,823 వచ్చినట్లు ఈవో గోగినేని లీలాకుమార్ తెలిపారు. ఉదయం 9గంటలకు ప్రారంభమైన లెక్కింపు సాయంత్రం 4గంటల వరకు కొనసాగినట్లు చెప్పారు. మూడు నెలలకు గాను ఆలయంలోని హుండీల ద్వారా రూ. 40,49,823, అన్నదాన సత్రంలోని హుండీ రూ. 54,658, వెండి 432గ్రాములు వచ్చినట్లు తెలిపారు. పాత గుంటూరు అగస్త్యేశ్వరస్వామి ఆలయ ఈవో సౌమ్య పర్యవేక్షణలో లెక్కింపు పూర్తయినట్లు ఆయన తెలిపారు.

మృదుభాషిణి కృషి స్ఫూర్తిదాయకం

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంతాల్లోని పేదల విద్యాభివృద్ధికి మృదుభాషిణి (93) చేసిన కృషి స్ఫూర్తిదాయకమని, ఆమె లేని లోటు తీర్చలేనిదని వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు, ఎమ్ఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ పేర్కొన్నారు. తెనాలి మండలం కొలకలూరు కరుణానిలయం విద్యా సంస్థల అధినేత మేడూరి మృదుభాషిణి శుక్రవారం మృతి చెందగా శనివారం వారు ఆమె భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. పొన్నేకంటి దయాచారి, సీహెచ్.శోభారాణి, పి.బి.కరుణాకర్, మంజుల, షబాబ్, డాక్టర్ ప్రభావతి తదితరులు ఉన్నారు.



అంత్యక్రియల కార్యక్రమంలో మందకృష్ణమాదిగ

ఈతకు దిగి బీటెక్ విద్యార్థి గల్లంతు

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: ఈతకు దిగి బీటెక్ విద్యార్థి గల్లంతు అయిన ఘటన సంగంజాగర్లమూడి వద్ద శనివారం జరిగింది. తెనాలి గ్రామీణ పోలీసుల కథనం ప్రకారం.. గుంటూరు కేవీపీ కాలనీకి చెందిన 19 సంవత్సరాల రవీంద్ర బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. తన మిత్రులతో కలిసి సంగంజాగర్లమూడిలోని శ్రీసంగమేశ్వర స్వామి దేవస్థానానికి వచ్చి దైవ దర్శనం అనంతరం ఈత కోసం కాలువలోకి దిగాడు. కాలువ ఉద్ధృతంగా ఉన్న నేపథ్యంలో గల్లంతు అయ్యాడు. పోలీసులు, అగ్నిమాపక కేంద్ర సిబ్బంది ఘటనా స్థలికి చేరి వెతికారు. ఆదివారం ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందం వస్తుందని పోలీసులు తెలిపారు. గల్లంతు అయిన రవీంద్ర తండ్రి చనిపోగా తల్లి గుంటూరు కార్పొరేషన్‌లో పనిచేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

జడివానతో అవస్థలు

తెనాలి(కొత్తపేట): పట్టణంలో శనివారం కురిసిన జడి వానకు జనజీవనం స్తంభించింది. ప్రకాశం, ఐతానగర్, బోసు, బుర్రిపాలెం, గంగానమ్మపేట, చినరావూరుపార్కు, చినరావూరు, చినరావూరుతోట రోడ్లతోపాటు అంతర్గత రహదారులు జలమయమయ్యాయి. వాహన చోదకులు, పాదచారులు నీట మునిగిన ప్రధాన రహదారుల్లో రాకపోకలు సాగించటానికి తీవ్ర ఇబ్బంది పడ్డారు. అంతర్గత తాగునీటి పైపులు నీట మునిగాయి.



తటాకాన్ని తలపిస్తున్న బోసురోడ్డు



ముత్తింశెట్టి పాలెంలో నీట మునిగిన పైపులు



జలమయమైన గంగానమ్మపేట రోడ్డు

వేజండ్ల విద్యార్థినుల ప్రతిభ

వేజండ్ల(చేబ్రోలు): జిల్లా స్థాయి అండర్- 17 బాలికల విభాగం వాలీబాల్ జట్టుకు వేజండ్ల జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థినులు ఎం.సుమశ్రీ, బి.మనీష, సీహెచ్.గీతామాధురి, ఎం.సంజన, పఠాన్ షాహేద ఎంపికయ్యారని పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు వెంకటేశ్వరరావు శనివారం తెలిపారు. వీరంతా ఈనెల 21 నుంచి 23 వరకు హిందూపురం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. విద్యార్థినులను పాఠశాల ప్రధానోపాధ్యాయిని జయశ్రీ, విద్యా కమిటీ ఛైర్మన్ పఠాన్ రబియా నస్రా అభినందనలు తెలిపారు.



రాష్ట్ర పోటీలకు ఎంపికైన విద్యార్థినులతో ఉపాధ్యాయులు

నేటి నుంచి ఎస్‌పీఎఫ్ క్రీడలు

ఎ.ఎన్.యు, న్యూస్‌టుడే: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఆదివారం నుంచి మూడు రోజులపాటు ఏపీ ప్రత్యేక రక్షణ దళం (ఎస్‌పీఎఫ్) క్రీడలు నిర్వహించనున్నారు. ఈ పోటీలను ఎస్‌పీఎఫ్ ఇన్‌ఛార్జి డీజీ త్రివిక్రమ వర్మ, ఐజీ రామిరెడ్డి, ఎస్‌పీఎఫ్ కమాండెంట్ శంకర్‌రావు ప్రారంభించనున్నారు. శనివారం కమాండెంట్ శంకరరావు ఇతర ఎస్‌పీఎఫ్ అధికారులు పరిశీలించారు.

మార్కెట్‌కు అనుగుణంగా వ్యూహాలు రచించాలి

పొన్నూరు: మార్కెట్‌కు అనుగుణంగా వ్యూహాలను రచించాల్సిన అవశ్యకత ఉందని పూణెలోని బజాజ్ చేతక్ ఎలక్ట్రిక్ వైస్ ప్రెసిడెంట్ ఎం.రే మహారాణా పేర్కొన్నారు. వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో బిజినెస్ డెవలప్‌మెంట్ సేల్స్ డిస్ట్రిబ్యూషన్ కెరీర్ పాత్ గ్రోత్ ఇంటర్వ్యూ టెక్నిక్స్ క్యాంపస్ టూ కార్పొరేట్ స్పెషలిస్ట్ అనే అంశంపై శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

టీకాల పంపిణీపై ఆకస్మిక తనిఖీ

పెదకాకాని: పెదకాకాని పీహెచ్‌సీ, నంబూరు ఆరోగ్య ఉప కేంద్రంలో జరుగుతున్న వివిధ టీకాల పంపిణీని శనివారం జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ ఎ.శ్రావణ్‌బాబు ఆకస్మికంగా తనిఖీ చేశారు.

వల్లూరి సేవలు చిరస్మరణీయం

పెదకాకాని, న్యూస్‌టుడే: పేదల ఆశాజ్యోతి వల్లూరి గంగాధరరావు సేవలు చిరస్మరణీయమని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు తెలిపారు. పెదకాకానిలో శనివారం గంగాధరరావు వర్ధంతి సందర్భంగా స్మారక స్థూపానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీపీఐ నాయకులు మాల్యాద్రి, రాధాకృష్ణ, హనుమంతరావు, కొల్లి రంగారెడ్డి, వల్లూరి నాగార్జున, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత డీజీపీ మాతృమూర్తికి నివాళి

నంబూరు(పెదకాకాని), న్యూస్‌టుడే: విశ్రాంత డీజీపీ మాలకొండయ్య మాతృమూర్తి దివంగత రుక్మిణమ్మ సంస్మరణ సభ సందర్భంగా శనివారం స్థానిక క్లబ్ హౌస్‌లో ఏర్పాటు చేసిన ఆమె చిత్రపటానికి పలువురు పోలీసు, రాజకీయ ప్రముఖులు నివాళులర్పించారు. మాలకొండయ్య కుటుంబ సభ్యులను పరామర్శించారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే: ఇండియన్ మెడికల్ అసోసియేషన్ తెనాలి శాఖ నూతన కార్యవర్గ ఎన్నిక ఏకగ్రీవమైందని ఎన్నికల అధికారులు వైద్యులు జి.నరసింహారావు, చందు, సాంబశివుడు, ఎం.వి.సత్యానాయణ పేర్కొన్నారు. వీరు శనివారం ఐఎంఏ తెనాలిశాఖ కార్యాలయంలో మాట్లాడుతూ.. 2024-25 సంవత్సరానికిగాను అధ్యక్షుడు డాక్టర్ కె.అనిల్‌కుమార్, కార్యదర్శి డాక్టర్ మధు ప్రభాకర్ బాబు, ఉపాధ్యక్షురాలు డాక్టర్ వి.పావని, సహాయ కార్యదర్శి డాక్టర్ చందు ఉదయ్ భాస్కర్, కోశాధికారి డాక్టర్ కె.శ్యామ్ ప్రసాద్ ఉంటారని పేర్కొన్నారు.

ప్రయాణికులకు మెరుగైన సౌకర్యం కల్పిస్తాం

పొన్నూరు, న్యూస్‌టుడే: ఆర్టీసీ బస్సులో ప్రయాణం చేస్తున్న ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని ఆర్టీసీ డిపో మేనేజర్ టి.అజితకుమారి పేర్కొన్నారు. పొన్నూరు ఆర్టీసీ డిపో ప్రాంగణంలో శనివారం నిర్వహించిన డయల్ యువర్ డీఎం కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు.

మంగళగిరి

• మంగళగిరి • తాడికొండ • ప్రత్తిపాడు

21న కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని పర్యటన

ప్రత్తిపాడు, న్యూస్‌టుడే: మండలంలో ఈనెల 21న కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్ర శేఖర్ పర్యటించనున్నట్లు తెదేపా మండల అధ్యక్షులు గింజుపల్లి శివరామ ప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో చెప్పారు. ఎమ్మెల్యే డాక్టర్ బూర్ల రామాంజనేయులు, మాజీ మంత్రి మాకినేని పెదరత్తయ్యతో కలిసి కోయవారిపాలెంలో ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తారు. ప్రత్తిపాడులో సీసీ రోడ్ల నిర్మాణానికి భూమి పూజ చేయనున్నట్లు తెలిపారు. తెదేపా, జనసేన, భాజపా జిల్లా నాయకులు, నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

రహదారి నిర్మాణానికి శ్రీకారం

ఈనాడు కథనానికి స్పందన

పెదనందిపాడు: ఉప్పలపాడులోని జడ్పీ ఉన్నత, ప్రాథమిక పాఠశాలలకు వెళ్లే మార్గంలో రూ.10 లక్షల ఖర్చుతో సీసీ రహదారి నిర్మాణానికి ప్రత్తిపాడు ఎమ్మెల్యే బి. రామాంజనేయులు శనివారం భూమి పూజ చేశారు. ఈ నెల 17న 'ఈనాడు'లో 'వానొస్తే... బడికి వెళ్లేదెట్టా..?' శీర్షికన ప్రచురితమైన కథనానికి స్పందనగా ఈ చర్యలు తీసుకున్నారు.



ఉప్పలపాడులో పాఠశాలకు వెళ్లే రహదారి నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే రామాంజనేయులు

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

మంగళగిరి: 80085 73111 ప్రత్తిపాడు: 99596 89564 తాడికొండ: 97053 99233

? తాడికొండ గ్రామంలోని దళిత్ పొగాకు కంపెనీ బజారులో వీధి దీపాలు వెలగడం లేదు. -(ప్రభు, గ్రామస్థుడు

✔ వీధి దీపాలకు మరమ్మతులు చేయిస్తాం. -హరిబాబు, పంచాయతీ కార్యదర్శి - న్యూస్‌టుడే, తాడికొండ

? పెదవడ్లపూడి వెళ్లే మార్గంలో మున్సిపల్ స్విమ్మింగ్ పూల్ ఎదుట రహదారి గుంతలు పడి అధ్వానంగా మారింది. -రామ్‌ప్రసాద్, పెదవడ్లపూడి

✔ పరిశీలించి గుంతలు పూడ్చేందుకు చర్యలు తీసుకుంటాం. - అలీంబాషా, కమిషనర్, నగరపాలక సంస్థ - న్యూస్‌టుడే, మంగళగిరి

పూడిక తీశారు

తాడికొండ: తాడికొండ బండ్ల బజారు సమీపంలో ప్రధాన మురుగు కాలువ నిండా రోడ్డుపై చేరింది. దుర్వాసనతో ప్రజలు ఇబ్బంది తీవ్రంగా పడుతున్నారు. దీనిపై ఈ నెల 16న 'మేమున్నాం... మీకు తోడుగా' శీర్షికన కథనం ప్రచురితమైంది. స్పందించిన పంచాయతీ కార్యదర్శి హరిబాబు పూడిక తీయించారు.

గుంతలు పూడ్చివేత

స్పందనకు వందనం

మంగళగిరి: మంగళగిరి నుంచి బైపాస్‌రోడ్డు వెళ్లే మార్గంలో పైవంతెన వద్ద ఏర్పడిన గుంతలను నగరపాలక అధికారులు శనివారం పూడ్చివేసి రాకపోకలకు అనువుగా తీర్చిదిద్దారు. 'ఈనాడు'లో ఈ నెల 19వ తేదీ 'మేమున్నాం.. మీకు తోడుగా' శీర్షికన సమస్య ప్రచురించంగా అధికారులు స్పందించి చర్యలు తీసుకున్నారు.

గుంతల మార్గాలతో.. గుండె బేజారు..!

నెలల తరబడి రహదారులపైనే మురుగు నీరు ✪ ప్రయాణానికి నరకయాతన

కుంచనపల్లి(తాడేపల్లి), న్యూస్‌టుడే

తాడేపల్లి మండలం కుంచనపల్లిలో సమస్యలు తిష్ఠ వేశాయి. విజయవాడ నగరానికి అతి సమీపంలో ఉన్న గ్రామం కావడంతో బహుళ అంతస్తులతో విస్తరించింది. దీంతో ఇక్కడ ఉన్నత వర్గాలు నివాసం ఉంటున్నారు. నిత్యం వేలాది మంది రాకపోకలు సాగించే ప్రధాన కూడలిగా మారింది. అంతటి ప్రాధాన్యత కలిగిన గ్రామంలో కనీస సౌకర్యాలకు నోచుకోవడం లేదు. ప్రధానంగా ఇక్కడ నిర్మాణాలకు డ్రైనేజీ సౌకర్యం లేదు. మురుగునీటిని గుంతలు తీసి దానిలో నిల్వచేసి ట్యాంకర్ల ద్వారా తరలించాల్సిన పరిస్థితి ఏర్పడింది. క్రమం తప్పకుండా పన్నులు వసూళ్లు చేస్తున్న నగరపాలక అధికారులు తాగునీరు, మురుగు పారుదల, వీధి దీపాలు తదితర సౌకర్యాలు ఏర్పాటు చేయడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



ప్రాతూరు క్రాస్‌రోడ్డు నుంచి కుంచనపల్లి వెళ్లే దారి ఇలా..

రాకపోకలకు అగచాట్లు

మంగళగిరి, తాడేపల్లి నగరపాలక సంస్థలో విలీన గ్రామంగా ఉన్న కుంచనపల్లిలో రహదార్లు అధ్వానంగా ఉన్నాయి. పంచాయతీ కార్యాలయం ఎదుట రహదారిపై ఏర్పడిన గుంత పూడ్చకపోవడం వల్ల వర్షపు నీరు నిలిచి బాటసారులకు అసౌకర్యంగా మారింది. నిత్యం గ్రామంలోని వారంతా పంచాయతీకి వివిధ పనులపై వచ్చి వెళుతుంటారు. నెలల తరబడి ఇదే పరిస్థితి కొనసాగడం వల్ల నాచుపట్టి దుర్వాసన వ్యాపిస్తోంది. పాఠశాల విద్యార్థులు ఆ నీటిలోనే నడక సాగిస్తున్నారు. దీని వల్ల కాళ్లకు చర్మ సమస్యలు వస్తున్నాయని వారు వాపోతున్నారు.

ఇళ్ల ముందే మురుగు..

గ్రామంలో అనేక అంతర్గత రోడ్లకు ఇరువైపులా మురుగు కాలువల నిర్మాణం జరగలేదు. ఫలితంగా ఇళ్లల్లో వినియోగించిన నీటితోపాటు వర్షం వస్తే నీరుపోయే మార్గంలేక రోడ్లపై తిష్ఠ వేస్తున్నాయి. దీనివల్ల గ్రామస్థులు అసౌకర్యానికి గురవుతున్నారు. ఇళ్లల్లో వినియోగించిన నీటిని బయటకు వదలడం వల్ల అక్కడే నిల్వ ఉండి దోమలు వృద్ధి చెంది కంటి మీద కునుకు లేకుండా పోతుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కుంచనపల్లి వంతెన కింద నుంచి ప్రాతూరు అడ్డ రోడ్డుకు వచ్చే మార్గం





పాఠశాలకు వెళ్లే రోడ్డు దుస్థితి

కూటమి ప్రభుత్వ హయాంలోనైనా తమ కష్టాలు పరిష్కరించాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

పరిశీలించి చర్యలు తీసుకుంటాం..

-శ్రీకాంత్, డిప్యూటీ కమిషనర్, నగరపాలక సంస్థ

గ్రామంలో మురుగునీటి సమస్య నిల్వలను తొలగిస్తాం. విద్యార్థులకు, గ్రామస్థులకు అసౌకర్యం లేకుండా శుభ్రపరుస్తాం. ఆయా సమస్యల శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం.

నష్ట పరిహారం పంపిణీపై కొనసాగిన విచారణ

రూ.12.85 లక్షలు రికవరీ



యలవర్తిపాడులో వివరాలు సేకరిస్తున్న అధికారులు

మేడికొండూరు, న్యూస్‌టుడే: యలవర్తిపాడు రెవెన్యూ పరిధిలో పంట నష్ట పరిహారం పంపిణీపై విచారణ శనివారం కూడా కొనసాగింది. ఇప్పటికి మొత్తం రూ.12.85 లక్షలు రికవరీ చేసినట్లు అధికారులు తెలిపారు. ఏడీఏ(డీఆర్‌సీ) సునీత తెలిపిన వివరాల మేరకు.. కొద్ది రోజుల కిందట తుపాను కారణంగా మొత్తం 106 హెక్టార్లలో పత్తి పంట దెబ్బతిని..104 మంది రైతులు నష్టపోయారని జాబితాలో చేర్చారు. వీరికి పంట నష్ట పరిహారం కింద రూ.18 లక్షలు ప్రభుత్వం జమ చేసింది. ఈ నేపథ్యంలో అవకతవకలు జరిగాయని ఆరోపణలు రావడంతో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అధికారులు విచారణ చేపట్టారు. మేడికొండూరు, సిరిపురానికి చెందిన 40 మంది రైతుల నుంచి ఇప్పటికీ రూ.12.85 లక్షలు రికవరీ చేశారు. ఇంకా దీనికి సంబంధించి సుమారు రూ.30 వేలు తిరిగి రావాల్సి ఉందని, కౌలుదారు గుర్తింపు కార్డులు ఆధారంగా అవకతవకలు జరిగినట్లు తెలుస్తోందని ఏడీఏ చెప్పారు. అర్హుల జాబితా ప్రకారం సోమవారం పంట పొలాలను పరిశీలిస్తామన్నారు. మేడికొండూరుకు చెందిన ఒక పత్తి వ్యాపారి, యలవర్తిపాడు రెవెన్యూ పరిధిలో పని చేస్తున్న వ్యవసాయ శాఖకు చెందిన ఒక తాత్కాలిక ఉద్యోగి పాత్రపై దృష్టిసారించామని వివరించారు. త్వరలో పూర్తి స్థాయి నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని చెప్పారు.

మహిళా సాధికారతే మంత్రి లోకేశ్ లక్ష్యం



కుట్టుమిషన్లు పంపిణీ చేస్తున్న తెలుగు మహిళా నాయకులు

తాడేపల్లి, న్యూస్‌టుడే: మహిళా సాధికారతే లక్ష్యంగా విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ కృషి చేస్తున్నారని తెదేపా రాష్ట్ర అధికార ప్రతినిధి తమ్మిశెట్టి జానకీదేవి అన్నారు. తాడేపల్లి పట్టణ, గ్రామీణ మండలంలోని 70 మంది మహిళలకు శనివారం ఉచితంగా కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. లోకేశ్ చేపట్టిన 'స్త్రీశక్తి సంక్షేమం' కార్యక్రమంలో భాగంగా శిక్షణ పూర్తి చేసుకున్నవారికి ధ్రువీకరణ పత్రాలు, మిషన్లు అందించారు. మంగళగిరిలోని డాక్టర్ ఎంఎస్ఎస్ భవన్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో నియోజకవర్గ తెలుగు మహిళా అధ్యక్షురాలు ఆరుద్ర భూలక్ష్మి, ప్రధాన కార్యదర్శి మంచికలపూడి వైష్ణవి, తాడేపల్లి మున్సిపల్ మాజీ ఛైర్‌పర్సన్ కొయ్యగూర మహాలక్ష్మి, పట్టణ మహిళా అధ్యక్షురాలు అన్నె కుసుమ, మాజీ కౌన్సిలర్ కాటాబత్తుని నిర్మలాదేవి, కుట్టుశిక్షణ ట్రైనర్ అరుణ తదితరులు పాల్గొన్నారు. ఇప్పటి వరకు 65 బృందాలకు శిక్షణ ఇచ్చినట్లు నిర్వాహకులు తెలిపారు.

ఉండవల్లిలో కొండచిలువ కలకలం



ఉండవల్లి(తాడేపల్లి), న్యూస్‌టుడే: తాడేపల్లి మండలం ఉండవల్లిలో శుక్రవారం రాత్రి భారీ కొండచిలువ కలకలం రేపింది. ఆరు అడుగులు ఉన్న కొండచిలువ నివాస ప్రాంతాల మధ్యకు రావడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. ఇళ్లచుట్టూ ఖాళీ ప్రదేశాలు ఉండడం, సమీపంలోని కొండపై నుంచి తరచూ కొండచిలువలు గ్రామంలోకి ప్రవేశిస్తున్నాయి. పలువురు కొండచిలువను వెంబడించి కొట్టి చంపేయడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

సిమెంటు ఫ్యాక్టరీ కార్మికులను ఆదుకోండి



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, పక్కన అజయ్‌కుమార్ తదితరులు

తాడేపల్లి, న్యూస్‌టుడే: తాడేపల్లి పరిధిలోని బ్రహ్మానందపురం ఏసీసీ సిమెంటు ఫ్యాక్టరీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి మంత్రి లోకేశ్ చొరవ చూపాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ కోరారు. శనివారం కార్మికులతో ఆయన సమావేశమయ్యారు. త్వరలో సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌ను కలిసి కార్మికుల సమస్యలను వివరిస్తానని తెలిపారు. 1993లో ఏసీసీ యాజమాన్యం సిమెంటు ఫ్యాక్టరీని అక్రమంగా లాకౌట్ చేసిందని, అప్పటి నుంచి కార్మికులు పరిహారం కోసం పోరాటం చేస్తూనే ఉన్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్, మంగళగిరి నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య, సహాయ కార్యదర్శి కంచర్ల కాశయ్య, తుదిమెల్ల వెంకటయ్య, నాయకులు బూగర వెంకటేశ్వర్లు, వేముల దుర్గారావు, స్టీవెన్, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

అవీ ఇవీ

సీపీఎం నాయకుడి మృతికి సంతాపం

తాడేపల్లి, న్యూస్‌టుడే: తాడేపల్లి ఎంపీటీసీ మాజీ సభ్యులు సోలా ముత్యాలరావు(56) మృతి చెందారు. అనారోగ్యంతో బాధపడుతూ శనివారం తెల్లవారుజామున ఆయన మృతి చెందారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు, సీపీఎం జిల్లా నాయకులు జొన్నా శివశంకరరావు, దొంతిరెడ్డి వెంకటరెడ్డి, బూరగ వెంకటేశ్వర్లు, దుర్గారావు తదితరులు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. రాష్ట్ర కార్యవర్గసభ్యుడు సీహెచ్ బాబురావు, సూర్యారావు, పాశం రామారావు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన

తాడేపల్లి, న్యూస్‌టుడే: మంగళగిరి, తాడేపల్లి నగర పరిధిలో పారిశుద్ధ్య పనుల నిర్వహణను కమిషనర్ అలీంబాషా సిబ్బందితో కలసి శనివారం ఆకస్మికంగా పరిశీలించారు. 11వవార్డు కొప్పురావుకాలనీలో స్థానికులతో మాట్లాడారు. 8వ వార్డు డాక్టర్ ఆంజనేయకాలనీ నుంచి బైపాస్ రోడ్డుకు వెళ్లే మార్గంలో గుంతలను గమనించి పూడ్పించారు. డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

పవర్ లిఫ్టింగ్‌లో సత్తా

తాడేపల్లి, న్యూస్‌టుడే: సౌత్ ఆఫ్రికాలోని సన్‌సిటీలో ఈ నెల 4నుంచి 13 వరకు జరిగిన పవర్‌లిఫ్టింగ్ సబ్‌జూనియర్, జూనియర్ పోటీల్లో కేఎల్‌యూ విద్యార్థిని సాదియా అల్మాస్ నాలుగు బంగారు పతకాలు సాధించినట్లు వీసీ డాక్టర్ పార్థసారథి వర్మ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఆమె వర్సిటీలో ప్రొవైస్ ఛాన్స్‌లర్ డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, క్రీడల అసోసియేట్ డీన్ డాక్టర్ హరికిషోర్ అభినందించారు.

బాలికల హక్కులపై అవగాహన తప్పనిసరి

మంగళగిరి, న్యూస్‌టుడే: సమాజంలో బాలికల హక్కులపై అవగాహన కలిగి ఉండాలని ఏఎన్‌యూ ప్రొఫెసర్ డాక్టర్ కొండలరావు అన్నారు. మంగళగిరి మండల పరిషత్ సమావేశ మందిరంలో శనివారం అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని నిర్వహించారు. గుడ్ షఫర్డ్ స్వచ్ఛంద సంస్థ, చైల్డ్ ప్రొటెక్షన్ ఇన్‌ఛార్జి సిస్టర్ లత అధ్యక్షత వహించారు. ప్రభుత్వ వైద్యశాల డాక్టర్ గీతాపద్మజ, పట్టణ ఎస్ఐ రవీంద్ర, న్యాయవాది కాళిదాసు తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్రుల వివరాల నమోదు

తాడికొండ: పట్టభద్రులందరూ తప్పనిసరిగా ఓటు నమోదు చేసుకోవాలని తెదేపా నాయకులు బండ్ల కోటేశ్వరరావు కోరారు. తాడికొండ మండలం బడేపురం గ్రామంలో నమోదు శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, తెదేపా, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం నాణ్యత పరిశీలన

దుగ్గిరాల, న్యూస్‌టుడే: జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఛైర్మన్ డి. శ్రీనివాసులు ఆదేశాను సారం దుగ్గిరాలలోని నాలుగు వసతి గృహాలను తెనాలి రెండవ అదనపు జూనియర్ సివిల్ న్యాయమూర్తి పి.రాజశేఖర్ శనివారం తనిఖీ చేశారు. మరుగుదొడ్లు, తాగునీరు, వంటశాల, బాలబాలికలకు భోజనం తయారీ తదితర అంశాలను పరిశీలించారు. మండల లీగల్‌సెల్ సర్వీసెస్ కమిటీ సిబ్బంది, షేక్ మహబూబ్ ఉన్నారు.

అమ్మవారికి ప్రత్యేక పూజలు

పెదవడ్లపూడి(మంగళగిరి): మంగళగిరి మండలం పెదవడ్లపూడిలో శ్రీదేవిశరన్నవరాత్రి ఉత్సవాలు ముగింపు సందర్భంగా అమ్మవారి విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు మాజీ సర్పంచి అన్నె చంద్రశేఖర్, తెలుగు మహిళా జిల్లా అధ్యక్షురాలు అన్నాబత్తుని విజయలక్ష్మి, గ్రామ తెదేపా అధ్యక్షుడు శివరామయ్య సంయుక్తంగా మహిళలకు పసుపు కుంకాలు, చేతి సంచులను అందజేశారు.

యువతి అదృశ్యంపై కేసు

కొర్నెపాడు(వట్టిచెరుకూరు), న్యూస్‌టుడే: కొర్నెపాడుకు చెందిన యువతి ఈనెల 12న కళాశాలకు వెళ్లి తిరిగి రాలేదు. బంధువులు వెతికినా ఆచూకీ దొరక్కపోవడంతో శనివారం పోలీసులను ఆశ్రయించారు. తండ్రి ఫిర్యాదు మేరకు వట్టిచెరుకూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

గొడవలకు దిగితే చర్యలు తప్పవు

ఫిరంగిపురం గ్రామీణం, న్యూస్‌టుడే: గొల్లపాలెంలో శనివారం సాయంత్రం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో 'వారధి' కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఫిరంగిపురం, మేడికొండూరు సీఐలు రవీంద్రబాబు, నాగూర్ మీరా సాహెబ్ మాట్లాడుతూ గొడవలకు దిగితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

పాము కాటుతో వృద్ధురాలి దుర్మరణం

పెదనందిపాడు: పాము కాటు వేయడంతో వృద్ధురాలు మృతి చెందిన సంఘటన పెదనందిపాడులో శనివారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన నూరుబాషా మస్తాన్‌బీ (60) ఒంటరిగా పూరింట్లో ఉంటున్నారు. వ్యవసాయ పనులకు వెళ్తూ జీవనం సాగిస్తున్నారు. ఆమెకు ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు ఉండగా.. వీరంతా మరో చోట ఉంటున్నారు. శనివారం ఉదయం మస్తాన్‌బీ ఇంటి ఆవరణలో పెరిగిన గడ్డి కోస్తుండగా పాము కాటేసింది. దీంతో అస్వస్థతకు గురైన ఆమెను బంధువులు స్థానిక పీహెచ్‌సీకి తరలించారు. అప్పటికే పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ ఆమె మృతి చెందారు.

పిడుగు పడి గొర్రెల మృతి

తాడికొండ: తాడికొండలో శనివారం ఉదయం ఎడతెరిపి లేని వర్షం కురిసింది. నిడుముక్కల గ్రామ శివారు పిడుగుపాటుకు చేలో మేత మేస్తున్న అయిదు గొర్రెలు మృతి చెందాయి. జీవాల మృతితో తీవ్రంగా నష్టపోయానని కాపరి వాపోయాడు.

ఆగని వాన.. అన్నదాతల్లో ఆందోళన

ప్రత్తిపాడు, న్యూస్‌టుడే

ప్రత్తిపాడు నియోజకవర్గంలో గత పది రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు పత్తి, మిరప, వరి, అపరాల పంటల్లో నీరు నిలిచాయి. రోజులో రెండు, మూడు గంటల పాటు వర్షం కురుస్తోంది. దీంతో నేల తడి ఆరక నీరు ఎక్కడికక్కడే నిలిచి ఇటీవల నాటిన మిరప మొక్కలు కుళ్లిపోతున్నాయి. పత్తి పంటలో గూడ, పూత రాలిపోతోంది. నాలుగు, ఐదు అడుగుల మేర పెరిగిన పత్తి మొక్కలో కాయలకు గాలి తగలక నల్లగా మారిపోతున్నాయి. ఏ గంటలో వర్షం కురుస్తుందో.. తెలియని పరిస్థితి. అప్పటికప్పుడే ఎండ, ఆ వెంటనే మబ్బులు కమ్ముకుని వర్షం కురవడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. గతేడాది వర్షాభావ పరిస్థితులు, డిసెంబరులో కురిసిన వర్షానికి మిరప పంట దెబ్బతింది. వచ్చిన కొంత దిగుబడికి ధర పడిపోవడంతో అన్నదాతలు భారీగా నష్టపోయారు. పత్తి పంట వాతావరణం అనుకూలించక తెగుళ్లతో దిగుబడి తగ్గింది. వర్షానికి చేతికి అందే దశలో వరి పంట దెబ్బతింది. అపరాలదీ ఇదే పరిస్థితి. గత మూడేళ్లగా వరుస నష్టాలు చవిచూస్తున్నామని, ఈసారైనా గట్టున పడతామనుకుంటే వర్షాలు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయని అన్నదాతలు వాపోతున్నారు.



నల్లగా మారిన పత్తి కాయలు



నిమ్మగడ్డవారిపాలెంలో మిరప పంటలో నిలిచిన వర్షపు నీరు

మిరప నాటు ఆలస్యం..



మూడున్నర ఎకరాల్లో పత్తి పంట వేశాను. మూడు ఎకరాల్లో మిరప నారు పోసి సిద్ధంగా ఉంచా. వేలాది రూపాయలు ఖర్చు చేసినా నారు పొలంలో నాటేందుకు ఆలస్యం అవుతోంది. వర్షాలకు నాటిన మొక్కలు కుళ్లిపోతున్నాయి. **-కుర్రి సత్యనారాయణ రెడ్డి, రైతు, కొత్తమల్లాయపాలెం**

పత్తి కాయలు కుళ్లిపోతున్నాయి...



నేను ఆరు ఎకరాల్లో పత్తి పంట సాగు చేశాను. శనగ పంట కోసం దుక్కి మూడు ఎకరాల్లో సిద్ధంగా ఉంచాను. ప్రతి రోజు జోరున వర్షం కురుస్తోంది. పత్తిలో పూత, గూడ రాలిపోతోంది. ఇప్పటికే వచ్చిన పత్తి కాయలు తడిచి నల్లగా మారాయి. రెండు వారాల నుంచి మందులు పిచికారీ చేయడం లేదు. **- కొల్లా అప్పారావు, రైతు, నిమ్మగడ్డవారిపాలెం**

ప్రత్తిపాడును ఆదర్శంగా తీర్చిదిద్దుతాం



గుంటూరు గ్రామీణం: అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసి శిలాఫలకం ఆవిష్కరించిన ఎమ్మెల్యే రామాంజనేయులు



దుగ్గిరాల మండలం ఈమనిలో..

గుంటూరు రూరల్, పెదనందిపాడు, దుగ్గిరాల, వట్టిచెరుకూరు, మేడికొండూరు, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావటంతో అభివృద్ధికి బాటలు పడ్డాయని రాబోయే రోజుల్లో ప్రత్తిపాడు నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే రామాంజనేయులు అన్నారు. పల్లెపండగ పంచాయతీ వారోత్సవాల్లో భాగంగా శనివారం రూరల్ మండలంలోని తురకపాలెం, మల్లవరం, తోకవారిపాలెం, దాసుపాలెం గ్రామాల్లో సీసీ రోడ్లకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఎంపీడీవో బండి శ్రీనివాసరావు, తెదేపా, జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. కొప్పర్రు, ఉప్పలపాడు, నాగులపాడు, పెదనందిపాడు, వరగాని, అబ్బినేనిగుంటపాలెం గ్రామాలలో శనివారం 'పల్లె పండగ' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రామాంజనేయులు రూ. 46 లక్షల వ్యయంతో నిర్మించనున్న అంతర్గత సిమెంట్ రోడ్లకు శంకుస్థాపన చేశారు. పలుచోట్ల ఆయా గ్రామాల సర్పంచులు, మండల స్థాయి అధికారులు భూమి పూజలు చేశారు.

పాఠశాల.. వసతి గృహాల తనిఖీ

పెదనందిపాడు: నాగులపాడులోని ప్రాథమిక, పెదనందిపాడు ఎస్సీ బాలుర వసతి గృహాన్ని శనివారం ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి జి. శ్రీవాణి(బాపట్ల) తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజన పథకం దస్త్రాలు, ఉపాధ్యాయుల హాజరును ఆమె పరిశీలించారు. పాఠశాల ఆవరణలో నివాసం ఉంటున్న కూలీల పాకలను వెంటనే తొలగింపజేయాలని, వసతి గృహాన్ని పరిశుభ్రంగా ఉంచాలని ఆవరణలో నీరు నిల్వకుండా చర్యలు తీసుకోవాలని వసతి గృహ సంక్షేమాధికారి కరుణాకర్‌కు సూచించారు.

రాజధాని రైతుల అభినందనలు



తుళ్లూరు: ఇరవై సూత్రాల అమలు కమిటీ ఛైర్మన్‌గా శనివారం రాష్ట్ర సచివాలయంలో బాధ్యతలు స్వీకరించిన లంకా దినకర్‌కు రాజధాని రైతులు, మహిళలు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా అమరావతి ఐకాస కన్వీనర్ పువ్వాడ సుధాకర్ మాట్లాడుతూ అమరావతి ఉద్యమానికి తోడ్పాటునందించిన దినకర్‌కు ఈ బాధ్యతలు అప్పగించటం హర్షణీయన్నారు.

నివాసితుల రక్షణకు కట్టుదిట్ట చర్యలు తీసుకోండి



మిడ్‌వ్యాలీ సిటీ కమిటీ ప్రతినిధులతో మాట్లాడుతున్న ఎస్ఐ వెంకట్

మంగళగిరి, న్యూస్‌టుడే: ప్రముఖులు నివాసం ఉంటున్న మిడ్ వ్యాలీ సిటీలో రక్షణ చర్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని మంగళగిరి గ్రామీణ ఎస్ఐ వెంకట్ సూచించారు. శనివారం రాత్రి నిర్వహణ కమిటీ ప్రతినిధులతోపాటు ఫ్లాట్ల యజమానులతో సమావేశమయ్యారు. వివిధ పనులపై మన వద్ద పనిచేసేవారు వివరాలను పూర్తిగా సేకరించాలని అపరిచితులను పనుల్లో పెట్టుకోవడం ద్వారా సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. మానిటరింగ్ కమిటీ నుంచి నిరభ్యంతర పత్రం పొందిన తరువాత పనిలోకి తీసుకోవాలన్నారు. సీసీ కెమెరాలు ఏర్పాటుతోపాటు వాటి పనితీరు ఎప్పటికప్పుడు పరిశీలించుకోవాలన్నారు. ఎలాంటి సమస్యలు ఎదురైనా పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

గుంటూరు తూర్పు



ఎన్టీఆర్ రైతుబజారులో ధరలు నిన్నటివి... (కిలో ఒక్కింటికి రూ.ల్లో) టమాట 40, వంగ 22, బెండ 24, పచ్చిమిర్చి 39, కాకర 32, క్యారెట్ 48, క్యాలీఫ్లవర్ 38, క్యాబేజీ 28, బీర 28, దొండ 24, బంగాళదుంప 39, ఉల్లిపాయలు 35, గోరుచిక్కుళ్లు 280, దోస 32, పొట్ల 30, మునగ 8, పెద్ద చిక్కుళ్లు 84, చామదుంప 40, మునగా రూ.8, గోంగూర 10, తోటకూర 15, కొత్తిమీర 25, బీట్‌రూట్ 39, కీర 24, క్యాప్సికం 64, అల్లం 60, ఫ్రెంచి బీన్స్ 94, సొర 16, అరటి 7 -న్యూస్‌టుడే, పట్నంబజారు

'చంద్రన్న మదర్సా నవీన' విద్యతో మేలు

గుంటూరు నగరం, న్యూస్‌టుడే: ముస్లిం మైనార్టీల విద్యార్థులకు మేలుచేకూరేలా తెదేపా ప్రవేశపెట్టిన చంద్రన్న మదర్సా నవీన విద్యా పథకం పట్ల ముస్లిం మైనారీలలో సర్వత్రా హర్షం వ్యక్తమవుతుందని రాష్ట్ర మైనార్టీ సెల్ కార్యదర్శి మహమ్మద్ ఖలీలుద్దీన్ అన్నారు. శనివారం ఇక్కడ ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. మదర్సాలలో పనిచేసే వాలంటీర్ల నియామకంపై మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఫారూఖ్ ఆమోదం తెలిపారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 185 మదర్సాలు ఉండగా ఒక్కోచోట ముగ్గురు చొప్పున 550 మంది విద్యా వాలంటీర్ల నియామకంపై ప్రతిపాదనలు సిద్ధమయ్యాయన్నారు. చంద్రన్న మదర్సా నవీన విద్యా పథకం కోసం ఏడాదికి రూ. 13 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు అంచనా వేశారని తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
94406 38515, 80085 73097

సమస్యల పరిష్కారం

స్పందనకు వందనం

★ వెంకట్రావుపేట ప్రధానరోడ్డులో చెత్త తొలగించకపోవడంతో రాకపోకలు చేసేవారు ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు కిరణ్ 'మేమున్నాం.. మీకుతోడుగా'కు తెలియజేశారు. సమస్య శానిటరీ సూపర్‌వైజర్ ఆయూబ్‌ఖాన్ దృష్టికి తీసుకెళ్లగా చెత్త కుప్పలు తొలగించేందుకు చర్యలు చేపట్టారు.

★ బాలాజీనగర్ పార్కు పక్కన సైడుకాల్వలో నీరు పారుదల లేక మురుగు నిలిచి దోమల బాధ అధికంగా ఉంటుందని స్థానికులు హుస్సేన్ తెలియజేశారు. ఈ సమస్య శానిటరీ సూపర్‌వైజర్ ఆయూబ్‌ఖాన్‌కు తెలియజేయగా వెంటనే సిబ్బందితో చర్యలు తీసుకున్నారు.

- న్యూస్‌టుడే, నగరపాలకసంస్థ(గుంటూరు)

విద్యుత్తు సరఫరాకు అంతరాయం నేడు

గుంటూరు విద్యుత్తు, న్యూస్‌టుడే: టౌన్-1 సబ్ డివిజన్ పరిధిలో విద్యుత్తు లైన్ల మరమ్మతులు చేస్తున్నందున ఈనెల 20న విద్యుత్తు సరఫరా నిలిపి వేస్తున్నట్లు డీఈఈ ఏడుకొండలు తెలిపారు. దీనివల్ల ఆదివారం ఉదయం 8 నుంచి 12 గంటల వరకు కొత్తపేట, సాంబశివపేట, నాజ్‌సెంటర్, లాలాపేట, రైలుపేట, అహమ్మద్‌నగర్ తదితర ప్రాంతాల్లో కరెంటు ఉండదని వెల్లడించారు.

వార్డు కార్యదర్శులు చొరవ చూపండి

నగరపాలకసంస్థ (గుంటూరు), న్యూస్‌టుడే: వార్డు సచివాలయాల కార్యదర్శులంతా తమ ప్రాంతాల్లో స్థానిక సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని కమిషనర్ పి.శ్రీనివాసులు ఆదేశించారు. శనివారం పర్యటనలో భాగంగా ఏటీ అగ్రహారం, నల్లకుంట, శ్యామలానగర్, పలకలూరురోడ్డు, ఉద్యోగనగర్ ప్రాంతాల్లో పారిశుద్ధ్యం, అభివృద్ధి పనులను ఆయన పరిశీలించి అధికారులకు ఆదేశాలిచ్చారు. ఏటీవీ కాలనీలో నగరపాలకసంస్థ పాఠశాల వద్ద పారిశుద్ధ్యం, కాల్వల శుభ్రత సరిగా లేకపోవడం గమనించి కార్యదర్శులపై ఆగ్రహం వ్యక్తంచేశారు. ఉదయం చెత్త సేకరణ తర్వాత సమస్యాత్మక ప్రాంతాల్లో గ్యాంగ్‌వర్క్ ఏర్పాటు చేసి కాల్వలు శుభ్రం చేయించాలని ఆదేశించారు. నగరంలో డ్రెయిన్ల నిర్మాణం తర్వాత రహదారి నిర్మాణాలు చేయాలన్నారు. నిర్మాణ సమయంలో ఆక్రమణల తొలగింపుకు చర్యలు తీసుకోవాలన్నారు. నివాసప్రాంతాల మధ్య ఖాళీ స్థలాలు ఉంటే ప్రజలు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారన్నారు. స్థల యజమానులను తెలుసుకుని శుభ్రం చేయించాలని లేకుంటే భారీ మొత్తంలో అపరాధరుసుం విధిస్తామని నోటీసులు ఇవ్వాలని ప్రజారోగ్య అధికారులను ఆదేశించారు. పలకలూరురోడ్డులో వాల్వ్ పిట్ రహదారి కంటే చాలా కిందకు ఉండటం వల్ల మురుగు చేరే ప్రమాదం ఉందని తక్షణం లెవల్ చేయాలని అధికారులను ఆదేశించారు. పర్యటనలో ఎస్ఈ నాగమల్లేశ్వరరావు, ఈఈ సుందరామిరెడ్డి, కార్పొరేటర్ శ్రీరాంప్రసాద్, డీఈఈలు మధుసూదన్, నాగభూషణం, ఎంహెచ్‌వో ఆనంద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


బస్టాండ్ వద్ద..


యానాది కాలనీలోని ప్రభుత్వ పాఠశాలలో..


ఆర్ అగ్రహారంలో..


కుగ్లర్ ఆసుపత్రి రోడ్డులో..

భారీ వర్షంతో చెరువులను తలపించిన రహదారులు

నగరం అతలాకుతలం


జీఎంసీ కార్యాలయం ఎదుట వర్షం నీటిలోనే రాకపోకలు


బొంగరాలబీడు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం లోపల..

నగరంలో శనివారం కురిసిన కుండపోత వర్షానికి రహదారులు చెరువులను తలపించాయి. తూర్పు నియోజకవర్గంలోని కొత్తపేట, గుంటూరువారితోట, రాజాగారితోట, శీలంవారివీధి, నాజ్‌సెంటర్, ఆర్టీసీ కాలనీ, సీతానగర్, అరుంధతీనగర్, మంగళదాస్‌నగర్, పరమయ్యకుంట, నెహ్రూనగర్, బుచ్చయ్యతోట, డొంకరోడ్డు, బొంగరాలబీడు, శ్రీనగర్, రాజీవ్‌గాంధీనగర్, శారదాకాలనీ, వివేక్‌నగర్, సంజీవయ్యనగర్, పాతగుంటూరు, సంగడిగుంట, లాంచెస్టర్ కాలనీ, సంజీవయ్యనగర్, వెంకట[illegible]లనీ, ప్రగతినగర్, ఆర్‌అగ్రహారం, సంపత్‌నగర్, పట్నంబజారు తదితర ప్రాంతాల్లోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. యానాదికాలనీలోని ప్రభుత్వపాఠశాలలో వర్షం నీరు నిండిపోవడంతో విద్యార్థులు ఇబ్బందిపడ్డారు. బొంగరాలబీడులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంను ముంచెత్తడంతో వైద్యులు, సిబ్బంది, రోగులు అవస్థలు పడ్డారు. డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండటంతో నగరంలోని రోడ్లన్నీ మురుగునీటితో నిండిపోయాయి. కార్లు, ద్విచక్రవాహనాలు మురుగునీటిలో కొట్టుకుపోయాయి. ఒకపక్క వర్షం మరోపక్క ట్రాఫిక్‌జామవడంతో పాఠశాలలు, కళాశాలలకు వెళ్లివచ్చే విద్యార్థులు, చిన్నపిల్లలు, వారి తల్లిదండ్రులు మురుగునీటితో నానా ఇబ్బందులుపడ్డారు. అధికారులు స్పందించి డ్రైనేజీ వ్యవస్థను బాగుచేయాలని కోరుతున్నారు. ఎన్టీఆర్ రైతుబజారులోకి వర్షపునీరు చేరటంతో రైతులు వ్యాపారాలు లేక శనివారం మధ్యాహ్నం నుంచి నిరాశతో ఇండ్లదారి పట్టారు.

- న్యూస్‌టుడే, నెహ్రూనగర్, నగరపాలక సంస్థ, గుంటూరు నగరం, పట్నాంబజారు


సంపత్‌నగర్‌లో..


మస్తానయ్య దర్గా సమీపంలో..


బుచ్చయ్యతోటలో..

మహిళా సంఘాల అభివృద్ధికి చర్యలు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే నసీర్

నగరపాలక సంస్థ (గుంటూరు), న్యూస్‌టుడే: మహిళా స్వయం సహాయక సంఘాల అభ్యున్నతిలో అవినీతికి తావులేకుండా కృషి చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తూర్పు ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్ అన్నారు. శనివారం జీఎంసీ కౌన్సిల్ హాల్‌లో మెప్మా సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ముందుగా స్వయం సహాయక సంఘాల గ్రూపు సభ్యులు, అందించిన రుణాలు, వసూళ్ల వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నసీర్ మాట్లాడుతూ రిసోర్సుపర్సన్లు అర్హులైన సంఘాలకు బ్యాంకుల నుంచి రుణాలు ఇప్పించేలా చిత్తశుద్ధితో కృషి చేయాలన్నారు. ఆర్పీలు ఎటువంటి ప్రలోభాలకు లోనుకాకుండా పని చేయాలని సూచించారు. ఎక్కడ అవినీతి జరిగినా సహించబోమని హెచ్చరించారు. తూర్పు నియోజకవర్గం మెప్మాకి సంబంధించిన వివరాల నివేదికను త్వరలో అందించాలని ఆదేశించారు. సమావేశంలో మెప్మా పీడీ విజయలక్ష్మి, జీఎంసీ డీసీ శ్రీనివాసరావు, ఎల్‌డీఎం రత్నమహిపాల్‌రెడ్డి, ఉపాసెల్ పీవో బాలాజీబాషా, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

ముఖేశ్‌కు సత్కారం

నెహ్రూనగర్, న్యూస్‌టుడే: అమెరికాలోని పెరూర్‌లో ఇటీవల జరిగిన ప్రపంచ జూనియర్ షూటింగ్ ఛాంపియన్‌షిప్‌లో ఏడు పతకాలు సాధించిన ముఖేష్ నేలవల్లిని శనివారం గుంటూరు శ్రీనగర్‌లోని తన నివాసంలో జనసేన రాష్ట్ర కార్యదర్శి, ఏపీ అర్బన్ డెవలపెమెంట్ ఫైనాన్స్ కార్పొరేషన్ కమిటీ సభ్యులు మార్కండేయ బాబు సత్కరించి అభినందనలు తెలిపారు. జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటరత్తయ్య, నగర కార్యదర్శి త్రిపుర, నాయకులు శంకర్‌రావు, రామప్రభు, వెంకటేశ్వరరావు, నాగేశ్వరరావు, ఆదినారాయణ ఉన్నారు.


ముఖేశ్ నేలవల్లిని సత్కరించిన మార్యండేయబాబు, జనసేనపార్టీ నాయకులు

బాణసంచా దుకాణాల అనుమతులపై సమీక్ష

కలెక్టరేట్(గుంటూరు): దీపావళి పండగను సురక్షితంగా ప్రశాంత వాతావరణంలో జరుపుకునేలా అవసరమైన ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని జిల్లా సంయుక్త కలెక్టర్ ఎ.భార్గవ్ తేజ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని ఎస్.ఆర్.శంకరన్ హాలులో శనివారం దీపావళి బాణసంచా దుకాణాల అనుమతులు, విక్రయాలపై అధికారులతో సమావేశమయ్యారు. జేసీ భార్గవ్ తేజ మాట్లాడుతూ బాణాసంచా హోల్‌సేల్ దుకాణాల్లో, సరకు నిల్వ చేసే గోదాముల్లో తనిఖీలు చేయాలన్నారు.

తక్కువ డిపాజిట్‌తో ఆటోనగర్‌లో తాగునీరు

నగరపాలక సంస్థ: ఆటోనగర్‌లో తక్కువ డిపాజిట్‌తో తాగునీరు కనెక్షన్ ఇచ్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలని తూర్పు ఎమ్మెల్యే నసీర్ పేర్కొన్నారు. శనివారం కమిషనర్ ఛాంబర్‌లో ఆటోనగర్ తాగునీటి సమస్య పరిష్కారం కోసం కమిషనర్ శ్రీనివాసులు, ఏపీఐఐసీ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ 1976లో ఆటోనగర్ ఏర్పాటుకాగా దీనిలో 2,416 ప్లాట్లు ఉన్నాయని, వీటిలో 55 ప్లాట్లకు మాత్రమే కుళాయి కనెక్షన్ ఉందన్నారు. 283 ఎకరాల్లో నాలుగు ఫేజుల్లో ఉన్న ఆటోనగర్‌లో డిపాజిట్ ఎక్కువగా ఉన్నందున కుళాయి కనెక్షన్ తీసుకునేందుకు ముందుకురావడం లేదన్నారు. చిన్న దుకాణాలకు రూ.5వేలు, ఇండస్ట్రియల్ అవసరాలకు రూ.18,500 డిపాజిట్‌గా పెట్టినట్లయితే ఎక్కువ మంది కుళాయికనెక్షన్లు తీసుకుంటారని ఎమ్మెల్యే తెలిపారు. అక్కడ ఉన్న ఓవర్ హెడ్ ట్యాంక్, 10 కి.మీ పైపులైన్ల నిర్మాణం, కనెక్షన్లు ఇచ్చేందుకు నిర్మాణ పనులకు రూ.9.31 కోట్లు అంచనా వేయగా ఇప్పటి వరకు రూ.6.31 కోట్లు పనులు జరగ్గా, రూ.3 కోట్ల పనులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. మిగిలిన నిర్మాణ పనులు త్వరలో పూర్తి చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. దీనితోపాటు పారిశుద్ధ్యం, రహదార్లు, డ్రెయిన్ల నిర్మాణం, విద్యుత్ పోల్స్ వేసేందుకు అంచనాలు వేయాలని ఏపీఐఐసీ అధికారులను ఆదేశించారు. వైకాపా పాలన ఐదేళ్లలో ఏనాడు ఆటోనగర్ అభివృద్ధిపై దృష్టి పెట్టలేదన్నారు.


తాగునీటిపై చర్చిస్తున్న కమిషనర్ శ్రీనివాసులు, ఎమ్మెల్యే నసీర్, అధికారులు

గోశాలకు ఆవుల తరలింపు

నగరపాలకసంస్థ, న్యూస్‌టుడే: నగరంలో ప్రధాన రహదారుల్లో ట్రాఫిక్‌కు అంతరాయంగా ఉంటున్న ఆవులు, ఎద్దులు, దూడలను వెంగళాయపాలెంలోని గోశాలకు తరలిస్తున్నామని, పశువులు రహదార్లపైకి రాకుండా యజమానులు చూసుకోవాలని కమిషనర్ శ్రీనివాసులు తెలిపారు. కమిషనర్ ఆదేశాలమేరకు శనివారం మార్కెట్, నల్లచెరువు, లక్ష్మీపురం, లాడ్జికూడలి, బృందావన్‌గార్డెన్స్ ప్రాంతాల్లో రహదార్లపై ట్రాఫిక్‌కు అడ్డుగా ఉన్న ఆవులను గోశాలకు తరలించారు. పశువుల యజమానులు నిర్లక్ష్యంతో ఉంటున్నారని, గోశాలకు తరలించిన వాటిని విడుదల చేసేందుకు భారీ అపరాధ రుసుం చెల్లించాల్సి ఉంటుందన్నారు.

వల్లూరికి నివాళి

నెహ్రూనగర్, న్యూస్‌టుడే: సీపీఐ జిల్లా మాజీ కార్యదర్శి వల్లూరు గంగాధరరావు వర్ధంతి సభ కాకాని రోడ్డులోని ఆయన స్థూపం వద్ద శనివారం నిర్వహించారు. గంగాధరరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు జంగాల అజయ్‌కుమార్, రాధాకృష్ణమూర్తి, సత్యనారాయణ, హనుమంతరావు, అరుణ్‌కుమార్, మాల్యాద్రి పాల్గొన్నారు.


స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న ముప్పాళ్ల నాగేశ్వరరావు, నాయకులు

అమరవీరుల వారోత్సవాలకు ఏర్పాట్లు

గుంటూరు నేరవార్తలు: అమరవీరులు సంస్మరణ వారోత్సవాల నిర్వహణకు పోలీసు ఉన్నతాధికారులు ఏర్పాట్లు చేపట్టారు. అందులో భాగంగా శనివారం పోలీసు కవాతు మైదానంలో ముందస్తు సాధన కార్యక్రమం నిర్వహించారు. ఏఆర్ ఏఎస్పీ హనుమంతు, డీఎస్పీ శాంతకుమార్, ఆర్ఐ శివరామకృష్ణ పాల్గొన్నారు.


నివాళులర్పిస్తున్న పోలీసు అధికారులు, సిబ్బంది

ఘనంగా సత్యసాయి పూజలు

పట్నంబజారు, న్యూస్‌టుడే: సంగడిగుంట మంత్రివారి వీధిలోని అయ్యప్ప రెసిడెన్సీలో శనివారం సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు కోవెలమూడి నారాయణరావు శనివారం భగవాన్ శ్రీ సత్య సాయిబాబా వారి భజన కార్యక్రమం నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని పూజలు నిర్వహించారు. జగన్మోహన్‌రావు, శివరామకృష్ణ, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ధర్నా జయప్రదం చేయండి

నెహ్రూనగర్, న్యూస్‌టుడే: విద్యుత్తు కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఈ నెల 22న ఎస్ఈ కార్యాలయం వద్ద నిర్వహించే ధర్నా జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వై.నేతాజీ పిలుపునిచ్చారు. శనివారం సీఐటీయూ కార్యాలయంలో యునైటెడ్ ఎలక్ట్రిసిటి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. నాయకులు లక్ష్మణారావు, రాంబాబు, రవికుమార్, వంశీ, రవి, రాజేష్, వర్మ పాల్గొన్నారు.

21 అమృతరావు జయంతి సభ


మాట్లాడుతున్న అమృతరాజ్, పక్కన తదితరులు

నెహ్రూనగర్, న్యూస్‌టుడే : ఈ నెల 21వ తేదీన గుంటూరు అమరావతిరోడ్డులోని అమృతరావు సెంటర్ వద్ద ఉక్కు దీక్ష బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు నిర్వహణ కమిటీ ఛైర్మన్ టి. అమృతరాజ్ తెలిపారు. అరండల్‌పేటలో శనివారం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. విశాఖ ఉక్కు సాధన కోసం ఆమరణ నిరాహార దీక్ష చేసి ఉద్యమానికి స్ఫూర్తినిచ్చిన సత్యాగ్రహీ, మాజీ ఎమ్మెల్యే తమనంపల్లి అమృతరావు 103వ జయంతి సందర్భంగా బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు వి.రాధాకృష్ణమూర్తి, అంజిబాబు, వందనంబాబు పాల్గొన్నారు.

మానవత్వం మరచి..

నెహ్రూనగర్, న్యూస్‌టుడే: ఓ వృద్ధుడిని ఆఖరి క్షణాల్లో ఆసుపత్రిలో వదిలేసి వెళ్లగా అతను మృతిచెందిన ఘటనపై శనివారం కొత్తపేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం... ఈ నెల 18న అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తి (55)ని గుంటూరు ప్రభుత్వాసుపత్రిలోని అత్యవసర విభాగం ఎదురుగా ఉన్న ఓపీ గది వద్దకు తీసుకువచ్చి వదిలిపెట్టి వెళ్లిపోయాడు. అక్కడ బల్లపై పడిపోయి ఉన్న అతన్ని గమనించిన వైద్యులు వెళ్లి చూడగా అప్పటికే అతను మృతిచెందినట్లు నిర్ధారించారు. ఆసుపత్రి వర్గాలు కొత్తపేట పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సీఐ వీరయ్య వెళ్లి పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతుని పేరు వివరాలు తెలియలేదని అతని గుర్చి తెలిసినవాళ్లు కొత్తపేట పోలీసులను సంప్రదించాలన్నారు.

కదలని బస్సు.. తప్పని అవస్థలు

గుంటూరు నగరం, కలెక్టరేట్, న్యూస్‌టుడే: ప్రయాణికులతో వెళ్తున్న బస్సులో సాంకేతిక లోపంతో తలెత్తడంతో ప్రధాన రహదారిలో మొరాయించింది. గుంటూరు డిపో నుంచి పర్చూరు వెళ్లే బస్సు శనివారం సాయంత్రం డిపో నుంచి బయలుదేరింది. బస్సు నల్లచెరువు సమీపంలోకి వచ్చిన సమయంలో సాంకేతిక లోపం తలెత్తడంతో రోడ్డుపై నిలిచిపోయింది. బస్సు డ్రైవర్ సమస్యను పరిష్కరించేందుకు ప్రయత్నించగా వీలుపడలేదు. దీంతో గ్యారేజి నుంచి మెకానిక్ రావాలని సమాచారం ఇచ్చారు. బస్సు రహదారిపై నిలిచిపోవటంతో అందులో ప్రయాణిస్తున్న 30 మంది ప్రయాణికులు ఇబ్బందులకు గురయ్యారు. పర్చూరు వైపు వెళుతున్న మరో బస్సును కండక్టర్ ఆపి ప్రయాణికులను అందులో పంపారు.


ప్రధాన రహదారిపై నిలిచిన బస్సు

ఎర్ర చెరువును కాపాడుకుందాం

నెహ్రూనగర్, న్యూస్‌టుడే: నగరంలోని ఎర్ర చెరువును కాపాడుకోవటానికి ఐక్యంగా పోరాటం చేయాలని ఆంధ్రప్రదేశ్ రజక జనసేవా సంఘం ప్రధాన కార్యదర్శి జూపూడి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. గంగానమ్మ కమిటీ హాలులో శనివారం నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. నగరంలో గతంలో నాలుగు చెరువులు ఉండగా వాటిలో మూడు చెరువులు ఆక్రమణలకు గురయ్యాయన్నారు. మిగిలిన ఎర్ర చెరువును కాపాడుకోవటానికి ఐక్యంగా కృషి చేయాలన్నారు. నాయకులు మహేంద్ర, ఉమామహేశ్వరరావు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు

22న శ్రీనిలయం-సీనియర్ సిటిజన్స్ కంఫర్ట్ హోమ్ ప్రారంభం

పట్టాభిపురం(గుంటూరు), న్యూస్‌టుడే: సీనియర్ సిటిజన్స్‌కు ఆహ్లాదకర వాతావరణంలో అత్యున్నత ప్రమాణాలతో, అత్యాధునిక వసతులతో శ్రీనిలయం పేరుతో సీనియర్ సిటిజన్స్ కంఫర్ట్ హోమ్‌ను అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు కాకతీయ కన్వెన్షన్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ యర్రా నాగేశ్వరరావు, కార్యదర్శి కొత్తపల్లి రమేష్ కృష్ణచంద్ర వెల్లడించారు. రూ.30 కోట్ల వ్యయంతో రాజధాని అమరావతికి సమీపంలో మోతడక వద్ద అయిదు అంతస్తులతో నిర్మించిన శ్రీనిలయం సీనియర్ సిటిజన్స్ కంఫర్ట్ హోమ్, ఫ్యామిలీ రిక్రియేషన్ సెంటర్‌ను 22వ తేదీన మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు చేతులమీదుగా ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. దీనికి సంబంధించిన బ్రోచర్‌ను శనివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో కోశాధికారి దామచర్ల శ్రీనివాసరావు, సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షులు జీవీ రాయుడు, సభ్యులు ప్రత్తిపాటి సురేష్, కొర్రపాటి రామారావు, గోరంట్ల పున్నయ్యచౌదరి, గంటా పున్నారావు, నాగమల్లేశ్వరరావు, రావి గోపాలకృష్ణ, నాగార్జున, రవీంద్ర, శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

గుంటూరు పశ్చిమ

ఉత్సాహంగా ప్రతిభా పాటవ పోటీలు

నవభారత్‌నగర్, న్యూస్‌టుడే: 'ఈనాడు' ఆధ్వర్యంలో జేకేసీ కళాశాలరోడ్డులోని డాక్టర్ కేఎల్‌పీ పాఠశాల విద్యార్థులకు శనివారం ప్రతిభాపాటవ పోటీలు నిర్వహించారు. 'ఇంటర్నెట్ వినియోగంతో లాభనష్టాలు.. విద్యార్థులపై సామాజిక మాధ్యమాల ప్రభావం' అంశంపై జరిగిన వ్యాసరచన పోటీల్లో 8, 9, 10 తరగతుల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. టి.ఉత్తేజ్ రెడ్డి(9వ తరగతి) మొదటి బహుమతిని, ఒ.వెంకటసాయి (9వ తరగతి) రెండో బహుమతిని, ఎ.మౌక్తిక్(8వ తరగతి) మూడో బహుమతి గెలుచుకున్నారు. విజేతలకు పాఠశాల కార్యదర్శి డాక్టర్ కొండబోలు కృష్ణప్రసాద్ బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ జి.రత్తయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు


విజేతలతో పాఠశాల కార్యదర్శి డాక్టర్ కె.కృష్ణప్రసాద్

విద్యుత్తు సరఫరాకు అంతరాయం నేడు

గుంటూరు విద్యుత్తు, న్యూస్‌టుడే: టౌన్-1 సబ్ డివిజన్ పరిధిలో విద్యుత్తు లైన్ల మరమ్మతులు చేస్తున్నందున ఈనెల 20న విద్యుత్తు సరఫరా నిలిపి వేస్తున్నట్లు డీఈఈ ఏడుకొండలు తెలిపారు. దీనివల్ల ఆదివారం ఉదయం 8 నుంచి 12 గంటల వరకు కొత్తపేట, సాంబశివపేట, నాజ్‌సెంటర్, లాలాపేట, లైలుపేట, అహ్మద్‌నగర్ తదితర ప్రాంతాల్లో కరెంటు ఉండదని వెల్లడించారు.

కార్యకర్తల సంక్షేమమే తెదేపా లక్ష్యం

పట్టాభిపురం, న్యూస్‌టుడే: తెలుగుదేశం పార్టీ కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటుందని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి తెలిపారు. క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే తెదేపా క్లస్టర్, యూనిట్, పోలింగ్ కేంద్రాల ఇన్‌ఛార్జిలతో శనివారం సమీక్ష నిర్వహించారు. ఈనెల 26వ తేదీ నుంచి ప్రారంభమయ్యే తెదేపా సభ్యత్వ నమోదుపై చర్చించారు. ఎమ్మెల్యే మాధవి మాట్లాడుతూ ఏ పార్టీకి లేనంత క్యాడర్ తెదేపా సొంతం. కార్యకర్తల సంక్షేమమే తెదేపా ధ్యేయం. నారా లోకేశ్ కార్యకర్తల సంక్షేమం కోసం ప్రత్యేకంగా నిధి ఏర్పాటు చేశారు. పార్టీ సభ్యులకు ఎన్నో ప్రయోజనాలు చేకూరుస్తున్నారు. గతంలో బీమా రూ.2 లక్షలు ఉండేది. ఇప్పుడు రూ.5 లక్షలకు పెంచారు. ఈ దఫా జీవిత కాల సభ్యత్వాన్ని ప్రవేశపెట్టారు. మృతి చెందిన కార్యకర్తల అంత్యక్రియలకు రూ.10000 వంతున తక్షణ సాయం అందజేయాలని నిర్ణయించారు. సభ్యత్వ నమోదులో ఎప్పుడూ గుంటూరు పశ్చిమ నియోజకవర్గం ముందంజలో ఉంటుంది. 26 నుంచి ప్రారంభమయ్యే సభ్యత్వ నమోదులో కూడా పశ్చిమ నియోజకవర్గాన్ని అగ్రస్థానంలో నిలబెట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు ముత్తినేని రాజేష్, ఉప్పుటూల సాంబశివరావు, రాళ్లబండి రామరాజు, తన్నీరు కృష్ణ, రబ్బాని తదితరులు పాల్గొన్నారు.


నాయకులతో సమావేశమైన ఎమ్మెల్యే గళ్లా మాధవి

భారీ వర్షం.. రహదారులు జలమయం


మార్కెట్ సెంటర్‌లో..


పల్నాడు బస్టాండ్ ప్రాంతంలో..


జడ్పీ ప్రాంగణంలో చెరువును తలపిస్తూ..


బి.ఆర్ గార్డెన్స్ ప్రధాన రహదారిలో..


కలెక్టర్ కార్యాలయ ప్రాంగణం ఇలా..


జిల్లా షెడ్యూల్ కులాల సేవా సంఘం కార్యాలయం వద్ద..

పట్టాభిపురం, ఎ.టి. అగ్రహారం, కలెక్టరేట్(గుంటూరు), జిల్లాపరిషత్తు, న్యూస్‌టుడే: నగరంలో శనివారం పడిన కుండపోత వర్షం జనజీవన్నాన్ని అతలాకుతలం చేసింది. ప్రధాన రహదారులన్నీ జలమయమయ్యాయి. అయిదేళ్ల పాటు ఎటువంటి అభివృద్ధికి నోచక అధ్వానంగా ఉన్న రహదారులు వర్షానికి తటాకాలను తలపించాయి. నవభారత్‌నగర్ ఒకటోలైను రహదారి చిన్నపాటి వర్షానికే కాలువలా మారింది. ఇదే లైనులో పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ కార్యాలయం ఉన్నప్పటికీ కార్పొరేషన్ అధికారులు కనీసం పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. నిత్యం వాహనాలతో రద్దీగా ఉండే బి.ఆర్ గార్డెన్స్ ప్రధాన రహదారి వాగును తలపించింది. డ్రెయిన్ ఆక్రమించడంతో వర్షపునీరు మురుగునీరు ఏకమై పొంగి పొర్లింది. దీంతో వాహనచోదకులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చింది. భారీ గుంతలు ఉండడంతో వర్షపునీటిలో కనిపించక ప్రజలు నానాయాతన పడ్డారు.


ప్రభుత్వ మహిళా కళాశాల రోడ్డులో వాహన చోదకుల తిప్పలు


కంకరగుంట ఆర్‌ఓబీ కింద వంతెన దగ్గర..


మ్యాంగో జిరోలైన్‌లో..


పోలీస్ కల్యాణమండపం దగ్గర..


అంకిరెడ్డిపాలెం వద్ద డ్రైయిన్‌కు మరమ్మతులు

స్టాలిన్‌బాబు మరణం కళారంగానికి లోటు

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: మంటపాల పాడిన పాటలను అలపించడంలో రాష్ట్ర స్థాయిలో తనకంటూ ఒక ప్రత్యేకతను సంతరించుకున్న చిట్టిపల్లి స్టాలిన్ బాబు ఆకస్మిక మరణం కళారంగానికి తీరని లోటని పలువురు నివాళులర్పించారు. శనివారం స్థానిక అమరావతి రోడ్డులోని అన్నదాన సమాజం ఆడిటోరియంలో జరిగిన సంతాపసభలో అఖిలభారత పంచాయతీ పరిషత్ జాతీయ ఉపాధ్యక్షులు డాక్టర్ జాస్తి వీరాంజనేయులు, మిరియాల ప్రసాదరావు, గాదె రత్నారెడ్డి, పెళ్లూరి కృష్ణారావు, కె.బాబురావు, డాక్టర్ శ్యామల కోటిరెడ్డి, టి.దేవదాసు, వెంకాయమ్మ తదితరులు పాల్గొని స్టాలిన్ బాబుకు నివాళులర్పించారు. కార్యక్రమంలో పలువురు గాయనీ గాయకులు, కళాకారులు పాల్గొన్నారు.

హక్కులను ఉల్లంఘించొద్దు

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: సమాజం శాంతియుతంగా నైతిక విలువలతో వృద్ధి చెందడానికి కేవలం చట్టాలు సరిపోవు.. మనిషి బుద్ధి మారాలి..ధర్మబద్ధత పెరగాలని జాతీయ మానవ హక్కుల కమిషన్ యాక్టింగ్ ఛైర్‌పర్సన్ విజయభారతి సయాని అన్నారు. శనివారం రాత్రి స్థానిక కలెక్టరేట్ రోడ్డులోని భారతీ విద్యాభవన్ ఆధ్వర్యంలో నగరంలోని పౌర సంఘాల నిర్వాహకులు, పలు కళాశాల విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి ఐజిఎస్ రాష్ట్ర సహా సమన్వయ కర్త వస్తేపుల్ లక్ష్మీనారాయణ అధ్యక్షత వహించారు. విజయభారతి సయాని మాట్లాడుతూ తోటి మనిషి ప్రాథమిక హక్కులకు ఎవరూ భంగం కలిగించ కూడదన్నారు. ఈ సందర్భంగా ఆమె చిన్నప్పటి నుంచి ఎన్ని కష్టాలు పడి ఉన్నత స్థితికి వచ్చింది, తనకు స్ఫూర్తినిచ్చిన సంఘటనల గురించి వివరించారు. వసతిగృహాల్లో బాలికలు, గిరిజన ప్రాంతాల్లో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు, వాటిలో కొన్నింటిని తాను పరిష్కరించిన తీరును వివరించారు. సభలో భారతీయ విద్యా భవన్ కార్యదర్శి పి.రామచంద్ర రాజు తదితరులు ప్రసంగించారు. అనంతరం జరిగిన ముఖాముఖిలో బదరీ నారాయణ ప్రైవేటు రంగంలో జరిగే ప్రాథమిక హక్కుల ఉల్లంఘన మీద కూడా కమిషన్ స్పందించాలని కోరారు. న్యాయవాది నర్రా శ్రీనివాస్ మూడు అంశాలు అడిగారు. జైళ్లలో మగ్గుతున్న జీవిత ఖైదీల గురించి పోలీసులు అక్రమంగా పెడుతున్న కేసులు, వేధింపుల గురించి, గుంటూరులో ఫుటపాత్‌ల ఆక్రమణల గురించి అడిగారు. వల్లూరి సదాశివరావు గుంటూరు నగరపాలక సంస్థ అలసత్వం గురించి వివరించారు. హిందూ ఫార్మసీ కాలేజి వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎ.ప్రత్యూష మాట్లాడుతూ ట్రాన్స్ జండర్ల సమస్యల పరిష్కారం గురించి, ప్రైవేటు రంగంలో ఉద్యోగం చేస్తున్న మహిళలకు ప్రసూతి సెలవుల అమలు చేసే విషయంలో జరుగుతున్న అలసత్వానికి పరిష్కారం అడిగారు. మేకల రవీంద్ర బాబు బాలలందరికీ విద్యా సదుపాయం విషయంలో జరుగుతున్న నిర్లక్ష్యానికి సరైన పరిష్కారం కావాలన్నారు. ప్రొఫెసర్ డీఎఆర్ సుబ్రహ్మణ్యం ప్రొఫెసర్ సాయి బాబు కేసును ఉటంకిస్తూ జైళ్లలో దివ్యాంగులు, వృద్ధులు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారాలు చూపాలన్నారు. సీతా రమేష్, మద్దిరాల రాధాకృష్ణ వివిధ అంశాలు ప్రస్తావించారు. ఇంకా పలువురు పాఠశాల విద్యార్థులు మోయలేనంత బరువుతో పుస్తకాలను భుజాన వేసుకు వెళ్లడం లాంటి అంశాలకు ప్రభుత్వాల నుంచి తగిన పరిష్కారాలు కావాలని కోరారు.


మాట్లాడుతున్న విజయభారతి సయాని, వేదికపై లక్ష్మీనారాయణ, రామచంద్ర రాజు

24న హిందూ కళాశాలలో మెగా జాబ్ మేళా

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: గుంటూరు హిందూ కళాశాలలో నిరుద్యోగ యువత కోసం మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ పీవీ ప్రసాద్ చెప్పారు. శనివారం కళాశాలలో మేళాకు సంబంధించిన గోడపత్రికను ఆవిష్కరించారు. సమర్థనం సంస్థ, హిందూ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 24న ఉదయం 9.30 గంటల నుంచి నిర్వహించే మేళాకు 30 ప్రముఖ కంపెనీల ప్రతినిధులు వస్తున్నారన్నారు. 18 నుంచి 35 సంవత్సరాల లోపు వయసు కలిగిన 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ, పీజీ చదివిన వారు అర్హులన్నారు. అర్హత, ఆసక్తి గల వారు ఆధార్ కార్డు నకలు, విద్యార్హత ధ్రువపత్రాలు తీసుకొని నేరుగా గుంటూరు మార్కెట్ కూడలిలోని హిందూ కళాశాలకు రావొచ్చన్నారు. మరిన్ని వివరాలకు 6364867800 నంబరులో సంప్రదించవచ్చని సూచించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ కె.దుర్గాప్రసాద్, సమర్థనం సంస్థ ఏపీ ఛాప్టర్ హెడ్ ఎంఆర్‌కె పరమహంస, బి.రంగారావు తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై ఆరోగ్యసభ నేడు

నగరంపాలెం: సీజనల్ వ్యాధులపై ఆదివారం ఉదయం 11 గంటలకు ఆరోగ్యసభ ఏర్పాటు చేస్తున్నట్లు అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి తెలిపారు. అరండల్‌పేట 15వ లైను కుబేర టవర్స్‌లోని అవగాహన సంస్థ కార్యాలయంలో జరిగే సభలో జనరల్ ఫిజిషియన్ డాక్టర్ రావెల నిరెన్ పాల్గొని ఫ్లూ, మలేరియా, డెంగీ, చర్మంపై దద్దుర్లు, దగ్గు, ఆయాసం తదితర వ్యాధులపై అవగాహన కలగజేస్తారన్నారు.

కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శి రాక నేడు

జిల్లాపరిషత్తు(గుంటూరు), న్యూస్‌టుడే: కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శి శైలేష్‌కుమార్ సింగ్ ఈనెల 20న జిల్లాకు రానున్నారని జిల్లా సమాచార శాఖ శనివారం ఓ ప్రకటనలో తెలిపింది. ఆదివారం రాత్రి 10.20 గంటలకు గన్నవరం విమానాశ్రయం నుంచి బయలుదేరి గుంటూరు చేరుకుని స్థానికంగా బస చేస్తారన్నారు. 21న గుంటూరులో జరగనున్న సంస్థాగత అభివృద్ధి ఆవాస్+2024 ప్రాంతీయ స్థాయి కార్యశాలకు హాజరవుతారని వివరించారు. అనంతరం దిల్లీ బయలుదేరి వెళతారన్నారని వెల్లడించారు.

సుందరయ్యనగర్ ప్రజలకు ఇళ్లపట్టాలు ఇవ్వండి

కలెక్టరేట్(గుంటూరు): పుచ్చలపల్లి సుందరయ్యనగర్ ప్రజలకు ఇళ్లస్థలాల పట్టాలు ఇప్పించాలని ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు కోరారు. ఈమేరకు శనివారం డీఆర్‌వో పెద్ది రోజాకు వినతిపత్రం అందించారు. నగరంలోని 41వ డివిజన్‌లో ఎలాంటి అభ్యంతరాలు లేని ప్రభుత్వ భూమిలో 350 కుటుంబాలు నివాసం ఉంటున్నారన్నారు. 2007 నుంచి అక్కడే ఇళ్లు వేసుకుని నివాసం ఉంటున్నారని, వారికి పట్టాలు మంజూరు చేయాలని కోరారు. వినతిపత్రం అందించిన వారిలో సీపీఎం నాయకులు పాశం రామారావు, బి.ముత్యాలరావు, సుందరయ్యనగర్ అభివృద్ధి కమిటీ కార్యదర్శి ఆది నికల్సన్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అవస్థల ఆవాసం

గుజ్జనగుండ్ల పరిసర వాసులకు కష్టాలు


గుజ్జనగుండ్లలోని కరెంట్ ఆఫీస్ ఎదురు రహదారి దుస్థితి

